విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్

9581419999



# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 ● సంచిక : 141 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi శుక్రవారం 5 జూన్ 2026 ● పేజీలు : 8 ● వెల 2/-


## కేరళను తాకిని నైరుతి రుతుపవనం

### మరో వారం రోజుల్లో తెలంగాణకు రాక



**తిరువనంతపురం,జూన్4 (చట్టం) న్యూస్ :** ఇంతకాలం మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేలా చల్లని కబురు వచ్చేసింది. కేరళకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దాంతో కేరళ తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక అక్కడ ఇనుంచి

మిగతా 2వ పేజీలో..

## రెండోరోజూ అమరావతిలో నారాయణ పర్యటన

- వాగుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- వర్షాకాలం నీటి జాగ్రత్తలపై మంత్రి సూచనలు

**అమరావతి,జూన్4 :(చట్టం) న్యూస్** వర్షాకాలం దృష్ట్యా రాజధాని అమరావతిలో వాగుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. వాగుల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. పురపాలక శాఖ మంత్రి పి నారాయణ రెండోరోజు గురువారం రాజధాని అమరావతిలో పర్యటించారు. కొండవీటి వాగు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎన్-9,8,7రోడ్లలో కొండవీటి వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జిల పనుల పురోగతిపై ఆరా తీశారు. బ్రిడ్జిల కింద కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం లేకుండా మట్టి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కొండవీటి వాగు వెడల్పు తక్కువగా ఉన్నచోట మరింత వెడల్పు చేయాలని సూచించారు. నీరుకొండలో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను కూడా మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజధానిలో ట్రంక్ రోడ్లు, బ్రిడ్జిలు, వాగుల అభివృద్ధి పనులు వేగంగా జరుగు తున్నాయని మంత్రి చెప్పారు. ట్రంక్ రోడ్లపై 43,ఎల్ పి ఎస్ (ల్యాండ్ పూలింగ్)జోన్లలో 32 బ్రిడ్జిలను నిర్మిస్తున్నామని మంత్రి చెప్పారు. వర్షాకాలంలో కొండవీటివాగు ప్రవాహానికి ఇబ్బంది లేకుండా మట్టి తొలగింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. శాఖమూరు,

మిగతా 2వ పేజీలో..

## ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనలో అరుదైన దృశ్యం

- ప్రమాదం నుంచి బయటపడేందుకు కిందకు దూకిన బాధితులు
- కింద పరుపులు పరచి కాపాడిన తండ్రీ కొడుకులు
- సోషల్ మీడియాలో వారిపై సరవ్తరా ప్రశంసలు

**న్యూఢిల్లీ,జూన్4 (చట్టం) న్యూస్ :** దేశరాజధాని ఢిల్లీలోని ఒక లాడ్జ్‌లో బుధవారం జరిగిన ఘోర అగ్ని ప్రమాదం ఘటనలో 21 మంది మృత్యువాతపడ్డారు. అయితే, స్థానికంగా షాపు నిర్వహిస్తున్న తండ్రీకొడుకులు భవనంలో చిక్కుకున్న అనేక మంది ప్రాణాలను కాపాడారు. ప్రస్తుతం వారిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. బుధవారం ఉదయం భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అనేక మంది చిక్కుకుపోయారు. వారు కిందకు వచ్చేందుకు ఏ అవకాశమూ లేకపోయింది. దీంతో కొందరు భవనం నుంచి కిందకు దూకేందుకు సిద్ధమయ్యారు. కిందకు దూకితే ఏం కాదుగా అంటూ అక్కడున్న వారిని ఆందోళనతో ప్రశ్నించారు. ఈ క్రమంలో రియాజుద్దీన్, ఆయన కుమారుడు అర్మాన్ రంగంలోకి దిగారు. క్షణకాలం కూడా ఆలస్యం చేయకుండా భవనానికి సమీపంలో నేలపై కొత్త పరుపులను పరిచారు. దీంతో, బాధితులు వాటిపైకి సురక్షితంగా దూకి తమ ప్రాణాలను కాపాడుకున్నారు. 'ఉదయం నేను షాపు వద్దకు వచ్చేసరికే అక్కడ పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో కూడా మంటలు వ్యాపించాయి. లోపలికి వేళ్లేందుకు, బయటకు వచ్చేందుకు అసలు ఏ దారీ లేకుండా పోయింది. మమ్మల్ని కిందకు దూకేయమంటారా అంటూ పై అంతస్తుల్లోని వారు భయంతో ప్రశ్నించారు. దీంతో, వెంటనే నేను మా షాపులోంచి 20 నుంచి 25 వరకూ పరుపులు, క్విల్ట్స్‌ను తీసుకొచ్చి భవనం బయట పరిచాను' అని అర్మాన్ అన్నారు. 'ఈ క్రమంలో మాకు రూ.2 లక్షల వరకూ నష్టం వచ్చింది. బాధితులకు దుప్పట్లు కూడా ఇచ్చాము. మృతులను బయటకు తెచ్చేందుకు కూడా దుప్పట్లను ఇచ్చాము. మా వద్ద ఉన్నవన్నీ ఇచ్చేశాము. మానవత్వపు కోణంలో చూస్తే ఎవరైనా ఒకటే. హిందువైనా, ముస్లింలైనా మనందరం భారతీయులమే. కాబట్టి, కష్టాల్లో ఉన్న సోదరులకు స్నేహం చేయడం మా బాధ్యత' అని అర్మాన్ తండ్రి రియాజుద్దీన్ అన్నారు. దీంతో, ఈ తండ్రీకొడుకులపై ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది.

## అమిర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

- కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు
- ఆస్తి, ప్రాణనష్టంపై అందని వివరాలు
- రంగంలోకి దిగిన ఫైర్ ఇంజన్లు, పోలీసులు
- అమిర్‌పేట-ఎస్సార్ నగర్ మధ్య ట్రాఫిక్ క్రమబద్ధీకరణ



**హైదరాబాద్,జూన్4 (చట్టం) న్యూస్ :** హైదరాబాద్ అమిర్‌పేటలో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో

మిగతా 2వ పేజీలో..

## రష్యాలో కొనసాగిన లోకేశ్ పర్యటన

### బిజినెస్ ఫోరమ్‌లో పెట్టుబడులపై చర్చ

**అమరావతి,జూన్4 (చట్టం) న్యూస్ :** రష్యాలో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఎస్పీఐఈఎఫ్ బిజినెస్ ఫోరం సదస్సులో ఆంధ్రప్రదేశ్ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. భారత్, రష్యాల మధ్య ఉన్న సుదీర్ఘ సాంకేతిక, ఆర్థిక అనుబంధాన్ని గుర్తుచేస్తూ, 2030 నాటికి 100 బిలియన్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవడంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో ఆంధ్రప్రదేశ్‌ను 2.5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ ధ్యేయమని ప్రకటిస్తూ.. అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను కేవలం పెట్టుబడిదారులుగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో సమాన భాగస్వాములుగా ఆహ్వానించారు. ఈ సదస్సులో భాగంగా రష్యాకు చెందిన ప్రముఖ ఉక్కు దిగ్గజం 'నోవోస్టల్-ఎం సంస్థ చైర్మన్ ఇవాన్ డెమ్చెంకోతో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భారతదేశంలో అత్యాధునిక ఈఏఎఫ్ (ఇంఈ) గ్రీన్ స్టీల్





ఎ÷-లాంట్ నిర్మాణాన్ని చేపట్టాలని, అదేవిధంగా ఏపీలోని ప్రతిష్ఠాత్మక పారిశ్రామిక హబ్ 'శ్రీసిటీ'లో రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లును ఏర్పాటు చేయాలని ఆయన

మిగతా 2వ పేజీలో..

## దేశానికి యువతే ప్రాణం

### యువతను తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటా

### ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ వెల్లడి



**అమరావతి,జూన్4 (చట్టం) న్యూస్ :** తన రాజకీయ ప్రయాణంలో యువత పాత్రను ప్రత్యేకంగా స్మరించుకుంటూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 2008లో ప్రజారాజ్యం పార్టీ(పీఆర్‌పీ) యువజన విభాగం 'యువరాజ్యం' కోసం పటిష్ఠమైన యువజన విభాగం నిర్మించాలని ప్రణాళిక చేశానని తెలిపారు. జనసేన పార్టీని స్థాపించి 12 ఏళ్లలో ఎన్నో కష్టాలు, పోరాటాలను అధిగమించిన తర్వాత.. పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అనుభవం, పరిణితితో నిండి, సంస్థాగత బాధ్యతలు చేపట్టడానికి, రాజకీయాలు నిర్వహించడానికి, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యువరాజ్యం యువజన విభాగానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 2005 నుంచి ఇప్పటి వరకు తనను విశ్వసించి అండగా నిలిచిన యువతకు పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత, దేశభక్తి కలిగిన యువతను, చైతన్యవంతమైన నాయకులను తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తానని పవన్ ప్రతిజ్ఞ చేశారు. నూతన భారత్.. జెన్‌జెడ్ తరం నుంచి అద్భుతమైన నాయకుల ఆవిర్భావానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. జెన్‌జెడ్ తరం.. బుజ్జగింపు రాజకీయాలు, వంశపారంపర్య రాజకీయాలు, కుల రాజకీయాలు, విభజన రాజకీయాలు, ప్రాంతీయ రాజకీయాలతో విసిగిపోయిందని అభిప్రాయపడ్డారు. ఈ తరం.. జవాబుదారీతనం గల రాజకీయాలను తీసుకురాగల నాయకుల కోసం ఎదురుచూస్తోందని చెప్పారు. అంతేగానీ, ప్రపంచ వేదికలపై భారత్‌ను బలహీనపరిచే నాయకుల కోసం కాదన్నారు. బలమైన, పటిష్ఠమైన భారత్‌ను నిర్మించగల నాయకుల కోసం జెన్‌జెడ్ యువత ఎదురుచూస్తోందని ఎక్స్ ఖాతాలో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

## ఇండియా కూటమికి బీటలు

### 8వతేదీ ఇండీ కూటమిని బహిష్కరించిన డిఎంకె హాజరు కాబోవడం లేదని ప్రకటన విడుదల

**న్యూఢిల్లీ,జూన్4(చట్టం) న్యూస్ :** అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇందులో భాగస్వామి అయిన డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 8వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే ఇండియా కూటమి సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పాల్గొనే ఈ భేటీకి వెళ్లే ప్రసక్తే లేదంటూ చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్

మిగతా 2వ పేజీలో..

## ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనలో మరో విషాదం

### ఒకే కుటుంబానికి చెందిన 8మంది దుర్మరణం

**న్యూఢిల్లీ,జూన్4 (చట్టం) న్యూస్ :** దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్‌లో గల ఫ్లోరిష్ స్టే రెస్టారెంట్‌లో బుధవారం ఉదయం జరిగిన ఘోర అగ్ని ప్రమాదం ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతిచెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. గురుగ్రామ్‌లోని సెక్టార్ 46కు చెందిన వివేక్ అగర్వాల్ అనే చార్టర్డ్ అకౌంటెంట్.. మ్యాక్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన తండ్రిని పరామర్శించేందుకు ఢిల్లీ వెళ్లారు. ఆయనతో పాటు తల్లి ప్రేమ్ లత, భార్య తర్జనీ అగర్వాల్, ఇద్దరు కుమార్తెలు జివిషా, వారియా, మరో ముగ్గురు బంధువులూ ఉన్నారు. వీరంతా బస చేసేందుకు.. ప్రమాదానికి గురైన ఫ్లోరిష్ స్టే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్‌లో 2 గదులను బుక్ చేసుకున్నారు. వీరు అల్పాహారం తీసుకుంటుండగా ఒక్కసారిగా ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మొత్తం 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ కుటుంబంలో ప్రాణాలతో మిగిలిన ఏకైక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివేక్ అగర్వాల్ తండ్రి రాధేశ్యామ్ అగర్వాల్(80) మాత్రమే. ఒకే కుటుంబంలోని 8 మంది మరణించడంతో గురుగ్రామ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా.. డీఎన్ఏ టెస్టుల అనంతరం బంధువులకు మృతదేహాలను అప్పగిస్తామని అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 8:30 గంటలకు ఆ రెస్టారెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇరుకైన భవనం కావడంతో వేగంగా మంటలు వ్యాపించాయి. ఎంట్రీ, ఎగ్జిట్ ఒకేచోట ఉండటంతో అందులో ఉన్నవారు తప్పించుకునేందుకు వీలులేకుండా పోయింది. ప్రమాద సమయంలో అందులో సుమారు 40 మంది ఉన్నట్టు సమాచారం. వారిలో 21 మంది చనిపోగా.. కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు కిటికీలు, భవనం పైనుంచి దూకి తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో విదేశీయులే ఎక్కువ మంది ఉన్నట్టు తెలుస్తోంది. వీరంతా సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా నుంచి చికిత్స కోసం అక్కడికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా.. ఢిల్లీ ప్రభుత్వం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద ఆ హోటల్‌కు లైసెన్స్ మంజూరు చేసింది. దీని ప్రకారం.. ఆ ప్రాపర్టీలో 6 గదులకే అనుమతి ఉండగా.. బేస్‌మెంట్‌లోని కొన్ని గదులతోపాటు మొత్తం 25 గదులతో ఆ రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.

## అవయవ మార్పిడి చట్టానికి ఆమోదం

- వివిధ రాష్ట్రాల్లో ఉన్నట్లుగానే అమలు
- బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం
- భీమిలీ తదితర బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా అమలు
- క్వాంటమ్ వ్యాలీ భూములకు స్టాంపు డ్యూటీ మినహాయింపు
- ఏవియేషన్ పాలసీ-2026కు కేబినెట్ ఆమోదం
- కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు
- ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంపు
- ఎపి కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి




**అమరావతి,జూన్4 (చట్టం) న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్న ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఆ నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ చట్టం అమలుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. 2011 కేంద్ర చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. అవయవ మార్పిడి ప్రక్రియలో పారదర్శకత, వైద్య సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే

మిగతా 2వ పేజీలో..

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం

### నేడు విశాఖలో టిడిపి సైకిల్ రైడ్



**అమరావతి,జూన్4(చట్టం) న్యూస్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహత్తర కార్యక్రమానికి టీడీపీ శ్రీకారం చుట్టనుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మిగతా 2వ పేజీలో..

## పాలమూరు ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష

- పలు ప్రాజెక్టులను ఏరియల్ సర్వే చేసిన సిఎం
- ప్రాజెక్టుల స్థితిగుతలపై అధికారులతో ఆరా

**మహబూబ్‌నగర్,జూన్4(చట్టం) న్యూస్ :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమశిలలో ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా ఏరియల్ సర్వే నిర్వహించారు. ముఖ్యమంత్రి , మంత్రుల బృందం పాలమూరు జిల్లాలోని పలు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ఆకాశ మార్గం ద్వారా క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదించిన నూతన బ్యారేజీల స్థలాలు, , జూరాల ప్రాజెక్టు డ్యామ్‌ను సీఎం రేవంత్ రెడ్డి వీక్షించారు. ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, నీటి నిల్వ సామర్థ్యం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గ పరిధిలోని కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల




పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పథకంలో అత్యంత కీలకమైన కాట్రేవుపల్లి పంప్ హౌస్ వద్ద జరుగుతున్న పనుల నిర్మాణ శైలిని, పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వీక్షించారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుండటంతో దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఏరియల్ సర్వే అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రుల బృందం కూడా ప్రాజెక్టుల వారీగా ఉన్న అడ్డంకులను తొలగించి, పనులను త్వరగా ముగించాలని అధికారులకు సూచించింది.

# కేరళను తాకిని నైరుతి రుతుపవనం

**మొదటి పేజి తరువాయి..**

తమిళనాడు, కర్నాటక,ఆంధ్రాలకు విస్తరిస్తాయి. మరో వారంలోపే ఈ రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది. అయితే గతంతో పోలిస్తే ఈసారి నైరుతి రుతుపవనాలు కొంత ఆలస్యంగా వచ్చాయి. వాస్తవానికి మే 26వ తేదీననే నైరుతి రుతపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా అంచనా వేసింది. కానీ, ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనాలు తలకిందుల య్యాయి. కాగా రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే కేరళలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో అటు తమిళనాడులోని 15 జిల్లాల్లోనూ రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరిక జారీచేసింది. ఇదిలావుంటే.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో (జూన్–సెప్టెంబర్) సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే 90శాతం వర్షమే ఈ సీజన్‌లో కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని, జూన్‌లో ఇవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్‌లో మాత్రం బలంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

# రెండోరోజూ అమరావతిలో నారాయణ పర్యటన

**మొదటి పేజి తరువాయి..**

పెనుమాక, నీరుకొండ రిజర్వాయర్లలో సగం పని పూర్తయిందని చెప్పారు. కొండవీటివాగు 23.7 కిలోమీటర్లు, పాలవాగు 16.7 కిలోమీటర్లు, గ్రేవిటీ కాలువ 7.84 కిలోమీటర్లు అభివృద్ధి చేస్తున్నామని మంత్రి చెప్పారు. నీరుకొండ రిజర్వాయర్ 440 ఎకరాలలో నిర్మాణం జరుగుతోందని అన్నారు. వైసిపి నాయకులు రైతుల ను రెచ్చగొడుతున్నారని, విభేదాలు సృష్టించి రాజధానిని విధ్వంసం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. అమరావతిపై వైసిపి కమిటీలు వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతుల భూములను వెనక్కి ఇచ్చేస్తామని వైసిపి నాయకులు చెబుతున్నారని, భవనాలు, రోడ్లు, పైపు లైన్లు ల నిర్మాణం పూర్తయ్యాక సిఎంగా పనిచేసిన వ్యక్తి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. రాజధాని పర్యటనలో మంత్రి వెంట అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) ఛైర్ పర్సన్ డి లక్ష్మీ పార్థసారధి, సి ఆర్ డి ఎ,ఎడిసి చీఫ్ ఇంజినీర్లు ఇతర అధికారులు ఉన్నారు.

# అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

**మొదటి పేజి తరువాయి..**

పిల్లర్ నంబర్ – 1043 సమీపంలో ఉన్న కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటలు వేగంగా వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దట్టమైన పొగ కారణంగా పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. భవనంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కూడా కొనసాగాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయంపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా అమీర్‌పేట నుంచి ఎస్సార్ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పరిసర ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఇతర మార్గాల వైపు మళ్లిస్తూ పరిస్థితిని నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు, వాహనదారులు అమీర్‌పేట– ఎస్సార్‌నగర్ మార్గాన్ని తాత్కాలికంగా నివారించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని అధికారులు సూచించారు. అలాగే విధుల్లో ఉన్న ట్రాఫిక్, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర సేవల సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

# రష్యాలో కొనసాగిన లోకేశ్ పర్యటన

**మొదటి పేజి తరువాయి..**

విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ 'సిస్టమా' ప్రెసిడెంట్ తాగిర్ సిట్దేకోవ్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేష్.. రాష్ట్రంలో సరికొత్త రవాణా, సాంకేతిక ప్రాజెక్టులపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అంతర్గత జలరవాణా మార్గాలలో పర్యావరణ అనుకూల 'ఎలక్ట్రిక్ రివర్ మెట్రో' పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించాలని కోరారు. దీంతో పాటు భవిష్యత్ సాంకేతికతలకు కేంద్రంగా నిలుస్తున్న ఏపీ 'క్వాంటమ్ వ్యాలీ ఫ్రేమ్ వర్క్' ప్రాజెక్టులో సిస్టమా సంస్థను భాగస్వామి కావాల్సిందిగా మంత్రి నారా లోకేష్ ఆహ్వానించారు. లోకేశ్‌తో లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు ఉన్నారు.

# ఇండియా కూటమికి బీటలు

**మొదటి పేజి తరువాయి..**

పార్టీ తమకు తీవ్ర ద్రోహం చేసిందంటూ డీఎంకే సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ పార్టీ వైఖరితో డీఎంకే శ్రేణులు తీవ్ర మనస్తాపం చెందాయని వివరించింది. అందులో భాగంగా కేడర్ భావాలను గౌరవిస్తూనే ఇండియా కూటమి భేటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది. జూన్ 8వ తేదీన ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ వేదికగా ఇండియా కూటమి అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కూటమి సమావేశానికి హాజరు కావాలని ఆ పార్టీ భాగస్వామ్య కూటమిల నుంచి డీఎంకేకు ఆహ్వానం అందింది. అయినప్పటికీ.. హాజరు కాకూడదని డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రవర్తించిన తీరుపై డీఎంకే శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వచ్చింది. తమ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాన్ని క్షమించేది లేదంటూ డీఎంకే ఒక ప్రకటన విడుదల చేసిన విషయం విదితమే. ఇండియా కూటమి ఏర్పడినప్పటి నుంచి డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా డీఎంకే గుర్తు చేసింది. నీట్, ఒకే దేశం–ఒకే సారి ఎన్నికలు, వక్ఫ్ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తమ పోరాటం కొనసాగుతుందని డీఎంకే వెల్లడించింది. కూటమితో భేటీకి దూరంగా ఉన్నప్పటికీ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఇతర పార్టీల పోరాటాలకు మద్దతు ఇస్తామని డీఎంకే ప్రకటించింది. దీంతో డీఎంకే – కాంగ్రెస్ బంధంలో వివాదం ముదిరినట్లు అయింది. అంతేకాకుండా జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమికి డీఎంకే భారీ షాక్ ఇచ్చినట్లు అయింది.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**మొదటి పేజి తరువాయి..**

అనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పేందుకు సైకిల్ యాత్ర చేపట్టనుందని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రేపు బాధ్యతగా సైకిల్ వినియోగించాలని అన్నారు. విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైకిల్ ప్రయాణం చేయనున్నట్లు చెప్పారు. ప్రపంచం నేడు వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం వంటి సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. ప్రజలు కూడా సైకిల్ యాత్రలో భాగస్వాములు కావాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సైకిల్ వినియోగం వల్ల కాలుష్యం తగ్గుతుందని, ఇంధన వినియోగం తగ్గుతుందని, ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పుకొచ్చారు. చిన్న ప్రయత్నాలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయన్నారు. 'నా దేశం నా బాధ్యతలో' భాగంగా ప్రతి ఒక్కరూ ఇంధన వినియోగం తగ్గించాలన్నారు. ఇంధన సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకునే ఈసారి మహానాడును హైబ్రిడ్ విధానంలో నిర్వహించి గ్రాండ్ సక్సెస్ సాధించామని తెలిపారు. ప్రజలందరూ సైకిల్ యాత్రలో భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు 'నేను సైతం' అంటూ ముందుకు రావాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

# అవయవ మార్పిడి చట్టానికి ఆమోదం

**మొదటి పేజి తరువాయి..**



అమలులో ఉన్న విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం తెలిపింది. భీమిలి, విశాఖపట్నం, శ్రీకాకుళం, చీరాల బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా ఈ పాలసీ అమలు చేయనున్నారు. గోవా, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల అనుభవాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే బీచ్ షాక్స్‌లు తెరిచి ఉంచడానికి అనుమతి ఇవ్వనున్నారు. పరిమిత రకాల మద్యం విక్రయాలకు మాత్రమే అనుమతి ఉండనుంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే తదుపరి విస్తరించే అవకాశం ఉంది. రాజధాని అమరావతి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఏవియేషన్, ఉపాధి, మత్స్యరంగం, పోలవరం, పారిశ్రామిక పార్కులు, పోర్టులు, పర్యాటకం వంటి వివిధ రంగాల్లోని ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి కేటాయించిన భూమి రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపును ఆమోదించింది. రాష్ట్రంలో రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ–2025 ముసాయిదాకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మద్దువలస, యేలేరు రిజర్వాయర్లలో ఫిషిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ పాలసీ–2026కు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే అగ్రిగోల్డ్ తదితర డిపాజిటర్ల కేసుల పరిష్కారం కోసం 21 పోస్టుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చిత్తూరు జిల్లాలో వ్యవసాయ శాఖ భూమిపై సోలార్ విద్యుత్ ఎ÷–లాంట్ ఏర్పాటుకు 30 ఏళ్ల లీజు ఇవ్వడానికి అనుమతి ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ హామీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు టెండర్లకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. రాజధాని అమరావతిలో పలు నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. పోలవరం సహా వివిధ ప్రాజెక్టుల పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు, గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీపీఎస్ అమల్లోకి రాకముందు ఇచ్చిన నోటిఫికేషన్లలో ఎంపికై.. వివిధ కారణాలతో సీపీఎస్ అమలు తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పింఛను వ్యవస్థ అమలు చేయాలనే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీలో సవరణలకు కేబినెట్ ఆమోదించింది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ ను జులై 1 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేసే ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది.

# అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న 'గ్రావిటీ అకాడమీ'పై వెంటనే విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- క్యాదాసి ప్రభాకర్**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా /జూన్ 4 ,(చట్టం బ్యూరో) :** కరీంనగర్ నగరంలో విద్యా రంగం పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులను అయోమయానికి గురిచేసే విధంగా కార్యకలాపాలు కొనసాగుతున్న అకాడమీలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. 'గ్రావిటీ అకాడమీ' పేరుతో కోచింగ్ సెంటర్ నిర్వహణతో పాటు, అవసరమైన అనుమతులు లేకుండానే జూనియర్ కళాశాల విద్యా కార్యక్రమాలు కొనసాగుతున్నాయనే ఫిర్యాదులపై ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్ చేస్తోంది. విద్య అనేది వ్యాపారం కాదు, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్ర బాధ్యత. అలాంటి రంగంలో నిబంధనలను పక్కనపెట్టి, గుర్తింపులు లేకుండా విద్యా సంస్థలు నిర్వహించబడటం అత్యంత తీవ్రమైన విషయం. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ఏ చర్యనైనా సమాజం సహించదు.

ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు, జీవోలు అమలులో ఉన్నాయా? లేదా? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. సంబంధిత సంస్థకు అవసరమైన అనుమతులు, గుర్తింపులు, మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలు ఉన్నాయా? లేదా? అనే విషయాలను అధికారులు ప్రజల ముందుంచాలి. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగుతున్నట్లు తేలితే, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థుల ప్రయోజనాలను కాపాడే చర్యలు చేపట్టాలి.

విద్యాశాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం ఇకనైనా నిర్లక్ష్య ధోరణిని వీడి తక్షణమే తనిఖీలు నిర్వహించాలి. ఫిర్యాదులను పక్కనపెట్టి మౌనంగా ఉండటం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. పారదర్శక విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవడం అధికారుల బాధ్యత. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల విశ్వాసం, విద్యా వ్యవస్థ ప్రతిష్ఠ కంటే గొప్పది ఏదీ లేదు. అందువల్ల 'గ్రావిటీ అకాడమీ' వ్యవహారంపై వెంటనే విచారణ జరిపి, అక్రమాలు ఉన్నట్లయితే కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తోంది. లేనిపక్షంలో విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరిస్తున్నాము.

# ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- **అపరెల్ పార్క్, గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలి**
- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / జూన్ - 04 ,(చట్టం బ్యూరో) :** జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్, వాహనాలు, ఇతర అంశాలపై పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సహకార శాఖ, మెప్మా, రవాణా శాఖ, వ్యవసాయ శాఖ, తదితర శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, హమాలీల సంఖ్య, గన్ని సంచులు, ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు మూసి వేశారు.. తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అపరెల్ పార్క్, గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. కొనుగోళ్లు తుది దశకు చేరిన కేంద్రాల నుంచి హమాలీలు, వాహనాలను ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. ధాన్యానికి అనుగుణంగా ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు, తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

# బోనాల సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్

**గుడి ఆవరణలో జమ్మి మొక్క నాటిన అడ్వకేట్ వేముల మనోహర్..**




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / జూన్ 3 ,(చట్టం బ్యూరో) :** మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో భాగంగా బోయినీపల్లి మండలం తడగొండ గ్రామ పోషమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా గుడి ఆవరణలో జమ్మి మొక్క నాటారు. అడ్వకేట్ వేముల మనోహర్ మాట్లాడుతూ, పోషమ్మ తల్లి గుడి వద్ద వేప, మామిడి, మోతుక చెట్లు తప్పనిసరిగా ఉండాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిందం రమేష్, మాజీ ఉపసర్పంచ్ కాసారపు శ్రీధర గౌడ్, వార్డు మెంబర్ బుర్ర రాజు, సింగరి రమేష్, దయ్యాల రాయమల్లు, అర్చకులు బూరుగుపల్లి రమేష్, నరేష్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మెంబర్ కమల్ గౌడ్ ఉన్నారు.

# రాష్ట్రంలో తగ్గని ఎండల తీవ్రత

**అంగన్‌వాడీ కేంద్రాలకు 14 వరకు సెలవులు**

**15న తిరిగి ప్రారంభించాలని ఆదేశాలు**



హైదరాబాద్ ,జూన్4(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా మే నెల ముగిసినా ఎండల తీవ్రత, వడగాల్పుల ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న పిల్లలు, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను పొడిగించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓఝా వేసవి సెలవులను జూన్ 13 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 14వ తేదీన ఆదివారం కావునా.. జూన్ 15 నుండి ఈ కేంద్రాలు యథావిధిగా తిరిగి పనిచేయడం ప్రారంభిస్తాయి.

నిజానికి ముందస్తు ప్రణాళిక ప్రకారం జూన్ 2వ తేదీ నుంచే అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను పునఃప్రారంభించాలని ప్రభుత్వం భావించింది. అయితే, జూన్ మొదటి వారంలో కూడా ఉష్ణోగ్రతలు 40 నుండి 45 డిగ్రీల సెల్సియస్ దాటుతుండటం, మధ్యాహ్నం వేళల్లో తీవ్రమైన ఉష్ణగాలులు వీస్తుండటంతో తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. చిన్న పిల్లలు ఎండ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సైతం ఎండల తీవ్రత కారణంగా వేసవి సెలవులను పొడిగించిన సంగతి తెలిసిందే. పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాలను కూడా జూన్ 14 వరకు మూసి ఉంచాలని, విద్యాసంస్థలతో పాటే జూన్ 15న ఒకేసారి తెరవాలని ప్రభుత్వం భావిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారు 3 నుండి 6 సంవత్సరాలలోపు పిల్లలు కావడంతో వారికి రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో వారు బయటకు వస్తే వడదెబ్బ తగిలి డీహైడ్రేషన్, జ్వరం బారిన పడే అవకాశం ఉంది. అందుకే వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ప్రభుత్వం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకుంది. సెలవుల పొడిగింపు కేవలం చిన్న పిల్లల రాకకు మాత్రమే వర్తిస్తుంది. అయితే అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందే పౌష్టికాహారం పంపిణీకి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అంగన్‌వాడీ సిబ్బందితో పాటు, చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన అధికారిక మార్గదర్శకాలు, జీవో త్వరలోనే విడుదల కానున్నాయి.

# ప్రజా భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి కార్యాచరణ : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

- **గ్రామ ప్రగతికి ప్రత్యేక గ్రామ సభలు దోహదం**
- **ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక గ్రామ సభల నిర్వహణ**
- **కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో పాల్గొన్న కలెక్టర్**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / జూన్ 4 ,(చట్టం బ్యూరో ) :** గ్రామ ప్రగతి, అభివృద్ధిపై చర్చించుకోవడానికి ప్రత్యేక గ్రామ సభలు దోహద పడతాయని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధికి కార్యాచరణ, ప్రణాళిక రూపొందించవచ్చని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.





ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంట మార్పిడి, వ్యవసాయ, ఉద్యానవన శాఖల కార్యాచరణ ప్రణాళిక, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, విపత్తుల నిర్వహణ, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, జల సంరక్షణ, అరైవ్–అలైవ్ తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. తమ మండల, గ్రామాల్లో ఉన్న అధికారులు శాఖల వారీగా ఏయే కార్యక్రమాలు చేపడుతున్నారు అనే విషయాలపై సంపూర్ణ అవగాహన ప్రజలు కలిగి ఉండాలని అన్నారు. వర్షాకాల సన్నద్ధతపై అధికారులు సూచించిన విషయాలను ప్రజలు పాటించాలని కలెక్టర్ అన్నారు. వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయడం గ్రామ పంచాయితీ బాధ్యత అని తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ -2026 పై ప్రజలు ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్త గా వేరు చేసి గ్రామ పంచాయితీ వాహనానికి అందించాలని అన్నారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్వహణపై అవగాహన పొందాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ వార్డులో చెత్తను వేరు చేసి కంపోస్ట్ షెడ్ కు తరలించే బాధ్యత ప్రతీ వార్డు సభ్యులు తీసుకోవాలని సూచించారు. మన ఆరోగ్యం పాడవకుండా ఉండాలంటే స్వచ్ఛందంగా ఈ సూచనలు పాటించాలని కలెకర్ పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాకు సంబంధించి క్రమం తప్పకుండా నీటి ట్యాంకులను బ్లీచింగ్ తో సిబ్బంది శుభ్రం చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా స్వచ్ఛమైన నీటి సరఫరా అందించే బాధ్యత అధికారులపై ఉంటుందని, నీటి సరఫరా, నిర్వహణ సక్రమంగా లేకపోతే ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. పంటల వైవిధ్యంపై రైతులు వ్యవసాయ అధికారులు అందించే సలహాలు, సూచనలు పాటించాలని, ఎల్నినో ప్రభావం దృష్ట్యా పంటలు సాగు చేసేముందు వ్యవసాయ అధికారులను సంప్రదించి, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే ఇబ్బందులు కలగకుండా ఉంటుందని అన్నారు. ఆయిల్ పామ్, కూరగాయలు, పత్తి, తదితర లాభదాయక పంటలను సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. ఆయిల్ పామ్ కు సంబంధించి సిద్దిపేట జిల్లా నర్మెట లో పరిశ్రమ ఉందని, పండించిన దిగుబడిని పరిశ్రమకు తీసుకువెళ్ళడానికి దూర భారం కూడా లేదని గుర్తు చేశారు. ఆయిల్ పామ్ సాగు చేయడానికి మొక్కలకు, డ్రిప్ కు సబ్సిడీ కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో అంతర పంటలను సాగు చేసేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. వరిలో సన్న వడ్లను సాగు చేస్తే బోనస్ అందించడం జరుగుతుందని, సన్న వడ్ల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. పంట మార్పిడి చేయకపోతే నేల సారం తగ్గుతుందనే విషయాన్ని రైతులు గమనించాలని పేర్కొన్నారు.

అరైవ్ – అలైవ్ లో భాగంగా రోడ్డు భద్రతపై అందరికీ అవగాహన కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాల సంఖ్య నియంత్రించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ద్విచక్రవాహనం నడిపే ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని అన్నారు. ప్రతీ నెల రోడ్డు భద్రత సమావేశాలు నిర్వహించి, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి అవసరమయ్యే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే బీఎల్ఓ లకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శాల మేరకు ఈ ఈ నెల 25 వ తేదీ నుండి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. గుర్తింపు కార్డులు చూపించి మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 12 వ తేదీ వరకు పర్యావరణ అంశాలపై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు.

అనంతరం గ్రామంలోని నర్సరీ, కంపోస్ట్ షెడ్‌ను కలెక్టర్ పరిశీలించారు. లక్ష్యానికి అనుగుణంగా మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. కంపోస్ట్ షెడ్‌ను పూర్తిగా వినియోగంలోకి తీసుకువచ్చి చెత్తను తప్పనిసరిగా నాలుగు విభాగాలుగా వేరు చేసి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి కుమారి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ అన్వర్, ఇంట్రా ఈఈ సుమలత, జిల్లా వైద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, సర్పంచ్ స్వాతి, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ స్నిగ్ధ, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

- **రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా**
- **12న రాజానగరంలో రిలే నిరాహార దీక్ష**

**కోరుకొండ చట్టం :** కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండు ఏళ్ళు గడుస్తున్నప్ప టికీ ప్రజలకు ఇచ్చిన హామీ లను నేటికీ అమలు చేయ లేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, రాజా నగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. "వెన్నుపోటు కి రెండేళ్లు" కార్యక్రమం పేరుతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో భాగంగా గురువారం కోరుకొండలో రాజా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

కూటమి ప్రభుత్వం ఎన్ని కల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టో, చంద్రబా బు పవన్ కళ్యాణ్ లు సంతకాలు చేసి ప్రజలకు అందించిన హామీల బాండ్ల ను దగ్ధం చేశారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల సమయంలో మోసపూరితమైన హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు.

ఈనెల 12వ తేదీన రాజానగరంలో రిలే నిరాహా ర దీక్ష చేపడతానని ప్రకటిం చారు. 12న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దీక్ష కొనసాగిస్తామన్నారు. రాజానగరంలో నాలుగు గంటలకు నిర్వహించే బహిరంగ సభలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, హామీ లు అమలకు చేయక పోవడం గురించి ప్రజలకు వివరిస్తామన్నారు. ఏడు నుంచి తొమ్మిదో తేదీ వరకు గ్రామాల్లో గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు. కోరుకొండ మెయిన్ రోడ్ లో గురువారం వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు --పవన్ సంతకాలు చేసి ప్రజలకు ఇచ్చిన బాండ్లను, మేని ఫెస్టో




ప్రతులను తగలబెట్టారు. మానవహారంగా ఏర్పడి కూటమి ప్రభుత్వా నికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అబద్ధపు హామీలతో ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వాన్నీ రానున్న రోజుల్లో ప్రజలు కూకటివేళ్ల తో పేకిలిస్తార న్నారు.

# ఏసీబీ వలలో ఎఫ్ఆర్వో

**కొడిమ్యాల, జూన్ 4(చట్టం) :** కొడిమ్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గులాం మొయినుద్దీన్ (57) రూపాయలు 80 వేలు గురువారం లంచం తీసుకుంటుండగా ఏసీబీ కరీంనగర్ యూనిట్ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపిన వివరాల్లోకి వెళితే.. 120 టేకు చెట్లను నరికి వాటి రవాణా అనుమతికి గాను ఫిర్యాదుదారు నుండి ఎఫ్ఆర్వో రూపాయలు రెండు లక్షలు డిమాండ్ చేయడం జరిగిందని తెలిపారు. గత నెల 13 న రూపాయలు ఒక లక్ష ఎఫ్ఆర్వో కు ఫిర్యాదుదారుడు ఇవ్వడం జరిగిందని తెలిపారు. మిగతా ఒక లక్ష డిమాండ్ చేయగా తగ్గించి రూపాయలు 80 వేలకు ఎఫ్ఆర్వో ఒప్పుకోగా మిగతా 80 వేల రూపాయలను గురువారం ఫారెస్ట్ ఆఫీసు కొడిమ్యాలలో ఎఫ్ఆర్వో కు అందజేసే క్రమంలో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం జరిగిందని తెలిపారు. అవినీతి అధికారిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి కరీంనగర్ ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక జడ్జి ముందు హాజరు పరచడం జరుగుతుందని తెలిపారు. కేసు విచారణలో ఉందని, ఫిర్యాదుదారు వివరాలు రక్షణ పరంగా గోప్యంగా ఉంచడం జరిగిందని తెలిపారు. ప్రజలకు సేవలు అందించే ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ సెల్ నంబర్ 1064 లో సంప్రదించాలని తెలిపారు.




# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు




- **రాష్ట్ర కార్యదర్శి, ధర్మవరం నియోజకవర్గ పరిశీలకులు నార్పల సత్యనారాయణ రెడ్డి,**
- **నార్పలలో వైఎస్సార్‌సీపీ భారీ నిరసన, అబద్ధపు బాండ్ల దహనం**



**నార్పల, జూన్ 4, (చట్టం) న్యూస్ :** ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం నిలువునా వంచించిందని రాష్ట్ర కార్యదర్శి, ధర్మవరం నియోజకవర్గ పరిశీలకులు నార్పల సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" పూర్తి అయిన సందర్భంగా పార్టీ అధినేత శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రివర్యులు డాక్టర్ సాకే శైలజానాథ్ సూచనలతో గురువారం నార్పల మండల కేంద్రంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, ధర్మవరం నియోజకవర్గ పరిశీలకులు నార్పల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు నార్పల మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం నార్పల సర్కిల్ వద్ద కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, మోసపూరిత విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.

**చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సంతకాల బాండ్ల దహనం:**

గత ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఉమ్మడిగా సంతకాలు చేసి ప్రజలకు పంపిణీ చేసిన అబద్ధపు బాండ్ పేపర్లు, టీడీపీ మేనిఫెస్టో పత్రాలు, మరియు వారి అబద్ధపు పత్రికా ప్రకటనల కాపీలను నార్పల సర్కిల్ నందు వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున దహనం చేసి తమ నిరసనను వ్యక్తపరిచారు.

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఈ రెండేళ్లలో ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయలేదని మండిపడ్డారు. నిరుద్యోగులు, మహిళలు, రైతులను అబద్ధపు వాగ్దానాలతో నిలువునా ముంచారని, ప్రజలు ఈ మోసపూరిత పాలనను గమనిస్తున్నారని ఆయన అన్నారు. ప్రజల పక్షాన నిలబడి కూటమి ప్రభుత్వ అరాచకాలను, అబద్ధాలను నిరంతరం ఎండగడతామని స్పష్టం చేశారు.

ఈ భారీ నిరసన కార్యక్రమంలో కన్వీనర్ ఖాదర్ వలి ఖాన్, ఎంపీపీ నాగేశ్వరావు, నియోజక వర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పట్నం ఫణీంద్ర, రాష్ట్ర వలంటీర్ల ప్రధాన కార్యదర్శి జయరామిరెడ్డి,జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి సాకే రామాంజినేయులు, Sc సెల్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్,జిల్లా యువజన విభాగపు కార్యదర్శులు సోహైల్,సాయి, మహేష్ నాయక్ , ్ంతీఎజూ అబ్జర్వర్లు వెంకటనారాయణరెడ్డి, పక్కిరెడ్డి, శంకర్ యాదవ్, అనుబంధ విభాగాల అధ్యక్షులు కోట్ల బయపరెడ్డి, లింగారెడ్డి, బాలనాగి బయన్న,రాంభూపాల్ రెడ్డి,అమీర్ ,శ్రీరాములు , చిన్నరామయ్య, రంగారెడ్డి,యుగంధర్, నారాయణరెడ్డి, రమేష్ రెడ్డి, కపాడం రాజు, నరసింహులు, తలారి రమణయ్య, రాజారెడ్డి,చికెన్ గోపాల్, జగదీశ్వర్ రెడ్డి,భాస్కర్ రెడ్డి, నాగరాజు, నరసింహ , ప్రవీణ్ , భాషా, జగ తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి

- **గ్రామ ప్రగతికి గ్రామసభలు దోహదం చేస్తాయి**
- **బూరుగుపల్లి లో గ్రామ సభ**



**బోయిన్ పల్లి మండలం /జూన్ 4,( చట్టం బ్యూరో) :** బోయిన్ పల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభ సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్ ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని మండల స్థాయి అధికారులు పాల్గొని మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి కార్యాచరణ చేయవచ్చని అన్నారు. గ్రామ ప్రగతికి ప్రత్యేక గ్రామసభలు దోహదం చేస్తాయని ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని ఈ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. వర్షాకాల సన్నద్ధత, పంట మార్పిడి వ్యవసాయ ఉద్యానవన శాఖల కార్యచరణ బడిబాట, వ్యర్థాల నిర్వహణ ,ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, రోడ్డు భద్రత వంటి అంశాలపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయం !

తెలంగాణను ముంచిన వారంతా ఇప్పుడు వీరతాళ్లు వేసుకుని..నా తెలంగాణ అంటూ ఊరేగుతున్నారు. విగ్రహాల పేరుతో కొందరు నిగ్రహం కోల్పోయి మాట్లాడుతున్నారు. తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడ్డదని వాపోతున్నారు. ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ కోసం మళ్లీ రాజకీయ రగడ మొదలయ్యింది. ఎవరికి వారు తామే తెలంగాణ భావి విధాతలమని మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను బూచిగా చూపి ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. నిజానికి తెలంగాణ ఏర్పడ్డ తరవాత జరిగిన ద్రోహం, అంతకుముందు ఎప్పుడూ జరగలేదు. ఉమ్మడి ఎపిలో జరగనంత దోపిడీ గత 12 ఏళ్లుగా సాగుతోంది. ఎక్కడిక్కడ భూములు దోచుకున్నారు. అప్పుల చేసి దోచుకున్నారు. తెలంగాణను అప్పసుల కుప్పచేసి అనుభవిస్తున్నారు. ఎవరికి వారు తామే తెలంగాణను ఉద్దరించామని చెప్పుకుంటున్నారు. నిరుద్యోగ సమస్య తీరలేదు. నీటి సమస్యలు తీరలేదు. నిధులు పారించలేదు. అంతెందుకు రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరలకు కొని సేకరణ సక్రమంగా చేయడంలో కూడా విఫలం అయ్యారు. మక్క, జొన్న, మిర్చి, పత్తి రైతులు ఏటా పడుతున్న కష్టాలను పట్టించుకోని అసమర్థులుగా మిగిలి పోయారు. ఇకపోతే తెలంగాణలో  కొత్తగా ఆస్తులు సృష్టించలేదు. అయినా పాలకులుగా పనిచేసిన వారు తామే తెలంగాణను ఉద్దరించామని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రజలకు పెన్షన్లు, ఇళ్లు, ఆరోగ్యశ్రీలు ఎరగా వేసి దర్జాగా దోచేస్తున్నారు. నిజానికి ఉమ్మడి ఎపి నుంచి తెలంగాణ విడివడ్డాక తెలంగాణ అభివృద్ధి చెందిందా..లేక అప్పుల పాలయ్యిందా అంటే..అప్పుల పాలయ్యిందని లెక్కలు చెబుతున్నాయి. సమయానికి జీతాలు ఇవ్వలేని వారు పాలకులు అయ్యారు. హైదరాబాద్ మీ అయ్య జాగీరా అని జనసేనాని పవన్ కళ్యాణ్ అనగానే కొందరు ఒంటి కాలిపై లేచి..అవును మా అయ్య జాగీరే అంటున్నారు. ఎందుకంటే మూడో వ్యక్తి వస్తే..దోచుకోవడానికి అవకాశం ఉండదు కనుక...ఎగిరెగిరి పడుతున్నారు. తెలంగాణ సమాజాన్ని బెదిరిస్తున్నావంటూ పవన్‌ను చీల్చి చెండాడేంత పని చేశారు.  పవన్ మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు నిజంగానే తెలంగాణలోని కొందరికి బాధ కలిగించాయి. అందులో అనుమానం లేదు. రాజకీయంగా తెలంగాణలో ఉన్న కొందరు జనసేనలోనూ ఉన్నారు. వారికి పదవులు రావాలంటే జనసేన పక్షాన పోటీ చేయాల్సిందే. రాజకీయ పార్టీ అన్న తరవాత పోటీకి సై అంటుంది. జనసేన కూడా అదే చేసింది. అయితే మిగతా  ప్రాంతాలకు, తెలంగాణకు ఓ రేఖ అడ్డంగా ఉంది. అదే సెంటిమెంట్. తెలంగాణ ప్రజలను ముంచిందే సెంటిమెంట్. ఆ సెంటిమెంట్‌తోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డది. అది అడ్డం పెట్టుకునే కెసిఆర్ కుటుంబం పదేళ్లు దర్జాగా తెలంగాణలో పాగా వేసి, ఇష్టారాజ్యంగా దోచుకున్నది. పదవులు, డబ్బులు, భూములు దోచేసారు. లక్షల కోట్లు తెలంగాణ నెత్తిన అప్పులు పెట్టారు. తరవాత గత రెండేళ్లుగా కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది. అభివృద్ధి పేరిట ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు పప్పు బెల్లాల్లా తెలంగాణను పంచుకుంటున్నారు. భూములు యధేచ్ఛగా అమ్మేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ రాకతో మరోమారు సెటిమెంట్ రగిల్చి బాగుపడాలన్న ధోరణిలో పొన్నం ప్రభాకర్, కెటిఆర్, కవితలు తామే అసలుసిసలు తెలంగాణ వారుసులమని చెప్పుకునే ప్రయత్నంలో పడ్డారు. తెలంగాణ సమాజం అస్తిత్వ సంక్షోభంల పడుతున్నదనీ గొంతు చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఆంధ్రా ఆధిపత్యం కిందకు వెళుతోందని ప్రకటించుకున్నారు. పవన్ కళ్యాణ్ ఎంట్రీ వెనక బిజెపి, మోడీ ఉన్నారని ఆరోపిస్తున్నారు. తెలంగాణ కూడా భారతదేశంలోనే ఉందని, అందుకు బిజెపి ఎక్కడైనా పావులు కదుపుతుందని తెలుసుకోవాలి. బిజెపికి తెలంగాణ కూడా ఒక రాష్ట్రమని తెలుసు. ఇక్కడ  పాగా వేయాలని ఎప్పటనుంచో కలలు కంటోంది. కనుక దాని ప్రయత్నాల్లో అది ఉంది. ఇది రాజకీయం. కెసిఆర్ కూడా భారత రాష్ట్ర సమితి అంటూ దేశాన్ని ఏలుతానని అన్ని రాష్ట్రాలు తిరిగారు. దానిని ఎవరైనా తప్పుపట్టారా అన్నది కెటిఆర్ చెప్పాలి. రాజకీయ పార్టీ పెట్టి ఇక్కడ వైఎస్ షర్మిల కూడా పాదయాత్ర చేశారు. తాను తెలంగాణ బిడ్డనని ప్రకటించుకున్నారు. అప్పుడు లేని రోషం ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నది ప్రశ్న. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వరాష్ట్రంలో ఆంధ్రా వలసవాదం పెరిగింది. దానికి కెసిఆర్  ఆద్యులు. ఆయనే మాకు ఆంధ్రాతో పేచీ లేదంటూ..జగన్‌ను పిలిచి భోజనం పెట్టి అలయ్ భలయ్ చేసుకున్నారు. కృష్ణా నీటిని ఎపికి దోచి పెట్టారని వస్తున్న ఆరోపణలకు కెసిఆర్ బృందం నుంచి సమాధానం లేదు. తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకుని, హైదరాబాద్ సంపదను కొల్లగొట్టడానికి వస్తున్నారని జనసేనాని పవన్ కళ్యాణ్‌ను విమర్శించే ముందు..ఇక్కడ ఎంత కొల్లగొట్టారో చెప్పాలి. ధరణి పేరుతో మోసాలు. కాళేశ్వరం పేరుతో దగా. టెలిఫోన్ ట్యాపింగ్. అస్మదీయులకు రాజ్యసభ పదవులు.. ఇలా చెప్పకుంటూ పోతే కథలు కోకొల్లలు. ఇప్పుడు రెండేళ్ల పాలనలో మంత్రులందరిపైనా అవినీతి గుప్పు మంటోంది. అయినా ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. తెలంగాణ మేధావులు నోరు మెదపడం లేదు. కాంగ్రెస్ వచ్చాకనే స్వేచ్ఛ వచ్చిందని కోదండరామ్ సార్ అంటున్నారు. అంటే కెసిఆర్ ఉన్నంతకాలం నిరంకుశ పాలనలో మగ్గామనే అర్థం కదా. తెలంగాణ అస్తిత్వం మీద దాడిలో, మోదీ, చంద్రబాబుల ఉమ్మడి ప్రణాళిక దాగి ఉందని ఘోషిస్తున్న వారు, ఏ రకమైన దాడి జరిగిందో చెప్పాలి.  ఈ గడ్డపై నివసిస్తూ ఇక్కడే మమేకమైన వారంతా  తెలంగాణ బిడ్డలే. వాళ్ల పిల్లల భవిష్యత్తు, వారి ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ ఈ తెలంగాణ రాష్ట్రంతోనే ముడిపడి ఉన్నాయి. రాజకీయ పార్టీలు అన్ని చోట్లా తమ అస్తిత్వం కోసం ప్రయత్నం చేస్తుంటాయి. కెసిఆర్ కుటుంబానికి చెందిన పార్టీలే తెలంగాణకు ప్రతినిధులు కాదు. తెలంగాణ కోసం కష్టపడే వారు ఎవరైనా రాజకీయలు చేసుకునే హక్కు ఉంటుంది. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి  పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనిని తప్పుపట్టడానికి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారం చలాయించిన సమైక్య పాలకులు, తెలంగాణ ఏర్పాటుతో అధికారం చేపట్టిన వారు కూడా తెలంగాణను నిలువునా దోచుకున్నారు. కాబట్టి ఎవ్వరు కూడా తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడలేదు. తమ స్వార్థ రాజకీయం కోసమే పోరాడారు. ఇంకా పోరాడుతున్నారు. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఇదే సెంటిమెంటుతో తమ ఉనికి కోసం కొందరు ఇప్పుడు నానా యాగీ చేస్తున్నారని గుర్తిస్తే మంచిది.

## భవిష్యత్యం అవసరాలకు పెట్టుబడి

### గూగుల్ తీరును అభినందించన ఉదయ్ కోటక్

ముంబై,జూన్4 : కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ తాజాగా భారతీయ వ్యాపార సంస్థలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దిగ్గజ కార్పొరేట్ సంస్థలు వేల కోట్లను ఆర్జిస్తున్నప్పటికీ సంతృప్తి చెందకుండా భవిష్యత్తుపై పెట్టుబడులు పెడుతున్న వైనాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా గూగుల్ గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ సంస్థ ఆర్థిక సామర్థ్యం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందని అన్నారు. 'గూగుల్ వార్షిక లాభం 160 బిలియన్ డాలర్లు. గత త్రైమాసికంలో 62 బిలియన్‌లను ఆర్జించింది. సంస్థ మార్కెట్ విలువ 4.5 ట్రిలియన్‌లు. భారతీయ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్, లాభాల కంటే ఇది ఎక్కువ. ఇది భారతీయ కంపెనీలకు మేలు కొలుపు కావాలి. ప్రస్తుత పరిస్థితి ఎంత మెరుగ్గా ఉన్నప్పటికీ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టాలి' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ పోస్టు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. కృత్రిమ మేధపై పెట్టుబడుల కోసం ఇటీవల గూగుల్ ఏకంగా 80 బిలియన్ డాలర్లను సేకరించేందుకు ప్రణాళిక ఆవిష్కరించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించింది. ప్రభుత్వాలు నిధుల సేకరణ జరిపే స్థాయిలో ఒక కార్పొరేట్ కంపెనీ దీర్ఘకాలిక వ్యూహంతో నిధులు సేకరించడంతో పెద్ద చర్చకు దారి తీసింది.

## పర్యావరణ పరిరక్షణకు సైకిల్ వినియోగం

### ప్రజలకు చంద్రబాబు విజ్ఞప్తి

అమరావతి,జూన్4 :  జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు సైకిల్ వినియోగించాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగే ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఆ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు సైకిల్‌పై వెళ్లనున్నారు. పర్యావరణ హితమైన సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రజలు, పార్టీ నేతలతోపాటు ప్రభుత్వంలో పని చేసే వారంతా శుక్రవారం సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం. ఈ సందర్భంగా గురువారం ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఆయన ఏమన్నారంటే.. 'రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దాం. భూమి మన ఇల్లు? ప్రకృతి మన జీవనాధారం. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత. సహజ వనరులను కాపాడుకుంటూ, గాలి, నీరు, నేలను కలుషితం కాకుండా అందరూ కృషి చేద్దాం. పచ్చదనం పెంపు, ఇంధన వనరులు పొదుపుగా వినియోగించడం అవసరం. అందులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న సైకిళ్లు, ఈ –సైకిళ్లపై ప్రయాణిద్దాం. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుదాం. రేపటి నా విశాఖ పర్యటనలో నేను సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను. అంతా సహకరించాలని, మంచి కార్యక్రమానికి కలిసి రావాలని కోరుతున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

- మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి
- ఇంకా సెంటిమెంట్ రాజకీయాలతో మోసం చేస్తే ఊరుకోరు
- బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు

హైదరాబాద్,జూన్4 : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఆయన మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుందని రాంచందర్ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంని ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కళ్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ఆనాడు పార్లమెంటులో తమ పార్టీ మద్దతు ప్రకటించిందని అన్నారు. సుష్మా స్వరాజ్ బేషరతుగా మద్దతు ఇస్తేనే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు.

కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రాంచందర్ రావు అభివర్ణించారు. ముమ్మందు బిజెపి తెలంగాణలో కీలకంగా మారుతుందన్నారు.

## పూర్వం ఉన్న లింకు రోడ్లను పూర్తి చేయడానికి అంచనా



పెగడపల్లి, జూన్ 04( చట్టం న్యూస్ ): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని పలు గ్రామాలను కలుపుతూ లింకు రోడ్లను పూర్తి చేయడానికి  తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు లక్ష్మణ్ కుమార్ గారి ఆదేశాల మేరకు ఏడుమోటలపల్లి నుండి నంచర్ల మీదుగా రంగాదాములపల్లి వరకు మద్దులపల్లి తండా నుండి పెగడపల్లి వరకు మద్దులపల్లి తండా నుండి వెంగళాయిపేట్మీదుగా లింగాపూర్ వరకు తండాల నుండి వివిధ గ్రామాలకు పూర్వంలో ఉన్న లింకు రోడ్లను పూర్తి చేయడానికి ట్రైబల్ ఏఈ గారి ద్వారా అంచనాలు పంపించడానికి ఈరోజు ట్రైబల్ ఏ ఈ ఈ మాధురి, పంచాయతీ రాజ్ డి ఈ ఈ అశ్విన్,తో కలిసి మొత్తం రోడ్లు పరిశీలించడం జరిగింది ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడారి తిరుపతి, నంచర్ల ఉపసర్పంచ్ ఎడ్ల శ్యాం సుందర్ రెడ్డి, మండల నాయకులు పూసల తిరుపతి,లింగంపల్లి మహేష్,అల్లూరి సత్యనారాయణ రెడ్డి, రవి నాయక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.





## విశాఖ వేదికగా జూలైలో ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలు

### పోస్టర్ ఆవిష్కరించిన విద్యార్థి నాయకులు

విశాఖపట్టణం,జూన్4 : భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జాతీయ సమావేశాలు జూలై 13,14,15 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, అధ్యక్షులు రామ్మోహన్ తెలిపారు. గురువారం జగదాంబ సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ సమావేశాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సమావేశాలకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు. కేంద్రంలోని ఎన్డీఎ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్ష నిర్వహణలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో, పరీక్షను రద్దు చేశారని, దీంతో ఈ పరీక్షకు హాజరైన 23 లక్షల మంది అభ్యర్థులు తీవ్రమైన ఆత్మ క్షోభకు గురయ్యారని చెప్పారు. అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. కేవలం నీట్ పరీక్షలు మాత్రమే కాకుండా యుజిసి పరీక్షలు, ఆఖరికి సిబిఎస్ఎస్సి పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి ఉందన్నారు. సిబిఎస్సి పరీక్ష నిర్వహణలో విఫలం చెందిన సి బి ఎస్ సి కార్యదర్శిని తొలగించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని ఎస్ఎఫ్ఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలకు అవసరమైన పాఠ్య పుస్తకాలను కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం ప్రకారం రూపొందించి పంపిస్తుందని చెప్పారు. వాటి పుస్తకాలలో మతాన్ని బోధించే విధంగా వీటి రూపకల్పన ఉందన్నారు. విద్యను కేంద్రీకరించడం సరికాదన్నారు. విద్య వికేంద్రీకరణ జరగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, అలాగే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వేసవి రోజులలో కూడా రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠశాలలను నిర్వహించాయని, వాటిపై ఎటువంటి చర్య లేదన్నారు. ఎస్ ఎస్ సి లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
ఉన్నతంగా రాణించారని గొప్పలు చెప్పిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అడ్డగోలుగా ప్రైవేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించడంతో, ఈ ఏడాది లక్ష మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు దూరమైనట్టు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీలలో అధ్యాపకుల పోస్టులు 5 వేలు ఖాళీలు ఉన్నాయన్నారు. గీతం వంటి ప్రైవేటు విద్యాసంస్థను అధికార పార్టీ వారే నడుపుతూ, ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకురావాలని కోరుతూ, విద్యను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.సాయి తేజ, ప్రధాన కార్యదర్శి జి. అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షం

### కరీంనగర్,జనగామ, ములుగు జిల్లాలో మోస్తరు వానలు

హైదరాబాద్,జూన్4(ఆర్ఎన్ఎ):తెలంగాణలోని పలు జిల్లాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పుర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు హుజూరాబాద్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో గాలి దుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. ములుగు జిల్లా మల్లంపల్లి, వెంకటాపూర్, ములుగు మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. కాలనీలకు కాలనీలు నీట మునిగిన పరిస్థితి ఉంది. సుభాష్ నగర్, ఆదర్శనగర్ కాలనీలు జలమయం కావడంతో ఇళ్లలోకి వరద నీరు చేరింది. స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ సహాయక చర్యలు చేపట్టారు. ప్రొ÷–లకెయినర్ల సహాయంతో డ్రైనేజీలు క్లీన్ చేయించి వరద నీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. కరీంనగర్ నగరంలో కురిసిన భారీ వర్షానికి కట్టరాంపూర్ నాగన్న చౌరస్తా దగ్గర ఓ ఇంటి ప్రహరీ కూలింది. గోడతో పాటు పక్కనే ఉన్న భారీ వృక్షం కూడా నేలకొరిగింది. అటుగా నిలిపి ఉన్న కారుపై శిథిలాలు పడటంతో కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. భారీ ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు పడుతున్న క్రమంలో.. పాత గోడలు, భారీ వృక్షాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షానికి పక్కనే ఉన్న డ్రైనేజీ పొంగి కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రాంగణం అంతా జలమయమైంది. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్?లో పిడుగు పడింది. మొబైల్?తో వర్షాన్ని రికార్డ్ చేస్తుండగా స్థానికుడు పిడుగుపాటుతో ఉలిక్కిపడ్డాడు.

## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

### ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం

### అఖిలపక్ష భేటీలో కమిటీ ఛైర్మన్ కేశవరావు



హైదరాబాద్,జూన్4 : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామని అన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ పక్రియ అమరవీరుల ద్వీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తామన్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తామని పేర్కొన్నారు.

# స్కూళ్లలో అక్రమంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ మరియు యూనిఫాంలో పేరిట దోపిడిని అరికట్టాలి

- విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- నిబంధనలకు విరుద్ధంగా విద్యా సామగ్రి అమ్ముతున్న స్కూళ్లపై తనిఖీలు నిర్వహించాలి



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా/జూన్ 4 ,(చట్టం బ్యూరో) :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను దోచుకుంటూ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫాంలను అమ్ముతున్న యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ కరీంనగర్ నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఆసంపెల్లి వినయ్ సాగర్ ఎస్ఎఫ్ఐ నగర్ కార్యదర్శి ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఆసంపెల్లి వినయ్ సాగర్ మాట్లాడుతూ, విద్య హక్కు అయినప్పటికీ నేడు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను పూర్తిగా వ్యాపార వస్తువుగా మార్చి తల్లిదండ్రులపై వేలాది రూపాయల అదనపు భారం మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అనేక ప్రైవేట్ పాఠశాలలలో మరియు తమకు అనుబంధంగా ఉన్న దుకాణాల ద్వారా పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంల నో అమ్ముతున్నారని తెలియజేశారు. విద్యాశాఖ అధికారులు ప్రతి ఏడాది తనిఖీలు నిర్వహించకపోవడం మరియు వారి నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్ విద్యా మాఫియా లాగా మారుతుంది ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు పిల్లల చదువుల కోసం అప్పులు చేసే పరిస్థితి ఏర్పడుతుండగా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు మౌనంగా ఉండటం బాధాకరమని పేర్కొన్నారు.

జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యాల గుర్తింపుతో పాటు వారి గుర్తింపును రద్దు చేసే వరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. విద్యను వ్యాపారీకరణ చేసే విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి ఉద్యమం నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే విద్యారంగ సమస్యలకు శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కమిటీ సభ్యులు జిల్లాల నవదీప్, శ్రీ విష్ణు, అమన్ దేవ్, వంశీ, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి

**డీఈవో : కె.రాము**

**కొడిమ్యాల, జూన్ 4(చట్టం) :** జగిత్యాల జిల్లాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా విద్యాధికారి కె.రాము భీమారం మండలంలోని రంగాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పబడుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెందుతారని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోకి పంపి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జగిత్యాల జిల్లా శాఖ నాయకులు బి.ఆనంద్ రావు, వై.అమర్నాథ్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







## ప్రకృతి ప్రగతికి చోదక శక్తి

(జూన్5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా)



ప్రకృతి రక్షణ ప్రజల సంరక్షణ
పచ్చని చెట్లే ప్రగతికి బాటలు

ప్రకృతి జీవ ప్రదాత ప్రకృతి
ప్రగతికి పురోగతికి చోదక శక్తి

సహజ వనరును రక్షిద్దాం
స్వయం స్వమృద్ధి సాదిద్దాం

మానవుని అనాలోచిత చర్యలు
పెరుగుతున్న వాతావరణ
వైపరీత్యాలు

ఉద్రుతమౌతున్న విపత్తులు
కాలుష్యమౌతున్న ప్రకృతి
మానవ స్వార్థానికి విధ్వంస
మౌతున్న ప్రకృతి

స్వార్థపు నీడలో ప్రకృతి
విలపిస్తోంది మనిషి చేసే
గాయాలకు ధరణీ
తల్లడిల్లుతోంది

పచ్చని అడవులు కాంక్రీట్
వనాలుగా మారుతుంటే
భవిష్యత్తు తరాల మనుగడ
ప్రశ్నార్థకమవుతుంది

దేశాల మధ్య పోటీ
ప్రపంచీకరణ సాంకేతీకరణ
కార్పోరేటీకరణ వాణిజ్యవాధం

ప్రకృతి పర్యావరణ
పతనానికి హేతువై
పరిశ్రమలు వెదజల్లే
ఘన ద్రవ వాయువులతో

నీరు నేల కాలుష్యమై
మానవ మనుగడ
ప్రమాదకరమైంది

విశ్వ జనావళికి
వైరస్ లే సంపద అవుతే
అనారోగ్యమే ఆస్తి
అయ్యింది

విచ్చల విడి ప్లాస్టిక్ వినియోగ
వరదల ప్రవాహాన్ని అడ్డుకొని
జల ప్రళయంతో జనం విల విల

మానవుని విచక్షణ రహిత
ప్రవర్తన ప్రకృతిని కబళిస్తుంది

మానవాళి దురాశ
జీవవైవిద్యానికి చేటు
ఓ పౌరుడా ఇకనైనా మేలుకో
ప్రకృతి రక్షణ నీ ప్రథమ
కర్తవ్యంగా ఎంచుకో

ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనే
మన లక్ష్యం కావాలి

చెరువుల కబ్జాలతో
విలాస వంతమైన విల్లాలతో
ప్రకృతిని నాశనం చేస్తూ
భూతాపం పెంచే
చర్యలు మానుకోవాలి

ప్రకృతి పర్యావరణం
పట్ల జనం అవగాహన
చైతన్యం పెంచుకొవాలి

చేయి చేయి కలుపుదాం
ఊరూరా మొక్కలు నాటుదాం
నీటి చుక్కను పొదుపుగా వాడుదాం
నీల తల్లి ఋణం తీర్చుకుందాం
కాలుష్య రహిత సమాజ స్థాపనకై
ముందుకు సాగుదాం

ప్రకృతి పర్యావరణ రక్షణకై
పౌర సమాజం ఉద్యమించాలి

అవగాహన చైతన్యంతో
జన జాగృతికై ఉపక్రమించాలి
ప్రకృతి ఉద్ధరణ ఉద్యమంగా
కొనసాగాలి

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
9440245771 కరీంనగర్

# అనుమతి లేని విద్యాసంస్థలను అడ్డుకుంటాం:

- AIFB జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ముందస్తు అరెస్ట్



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / జూన్ 3 ,(చట్టం బ్యూరో) :** కరీంనగర్ నగరంలో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలు, అకాడమీల ఎదుట భవిష్యత్తులో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (AIFB) జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ హెచ్చరించారు. గురువారం ఆయనను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా బండారి శేఖర్ మాట్లాడుతూ, అరెస్టులతో తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వ తీరుపై ఆందోళన కలుగుతున్నదని అన్నారు. అనుమతిలేని విద్యాసాంస్థలను ప్రోత్సహిస్తున్నదా అని ప్రశ్నించారు. కరీంనగర్ నగరంలో అనుమతి లేని 'రెజోనెన్స్ అకాడమీ' ప్రచార కార్యక్రమానికి వస్తున్న మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణను అడ్డుకుంటామని చెబితే ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ఆయన ప్రశ్నించారు. అనుమతులు లేకుండా ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు, అకాడమీలు ఎలా నిర్వహిస్తారని నిలదీశారు.



జేడీ లక్ష్మీనారాయణకు విజ్ఞప్తి: “మాజీ ఐపీఎస్ జేడీ లక్ష్మీనారాయణ గారంటే మాకు ఎంతో గౌరవం ఉంది. కానీ కరీంనగర్‌లోని ఎలైట్ హోటల్‌లో అనుమతి లేని రెజోనెన్స్ అకాడమీకి సంబంధించి IIT-JEE, NEET ఫౌండేషన్ పేరుతో జరుగుతున్న ప్రచారానికి ఆయన రావడం సరికాదు. దీన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం” అని శేఖర్ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును, తల్లిదండ్రుల అవసరాలను విద్యాసంస్థలు వ్యాపార అవకాశంగా మార్చుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘన: అకాడమీల పేరుతో పగటిపూట కూడా కళాశాలలు నడపడం నిబంధనలకు విరుద్ధమని, నిబంధనల ప్రకారం అకాడమీలు కేవలం సాయంత్రం వేళల్లో మాత్రమే నిర్వహించుకోవాలని ఆయన గుర్తుచేశారు.చట్టవిరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తే వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థి లోకం తరపున ఆందోళనలను ఉధృతం చేస్తామని బండారి శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రత్యేక గ్రామసభ నిర్వహణ

**కొడిమ్యాల, జూన్ 4(చట్టం) :** ప్రజా పాలన..ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మండలంలోని చెప్యాల గ్రామంలో సర్పంచ్ వూట్కూరి శ్రీలత ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా కొడిమ్యాల తహశీల్దార్ నరేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో తడి, పొడి చెత్త నిర్వహణ, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యము, చెట్ల పెంపకం తదితర విషయాలపై చర్చించారు. అనంతరం గుట్ట రామాలయం వద్ద మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఆర్టీ రాజారామ్, తిరుపతి, జీపీవో పద్మ, పంచాయతీ కార్యదర్శి శివరాజ్ సింగ్, ఉప సర్పంచ్ సాయికిరణ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, ఈజీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# బోయినిపల్లి, కోరెం, కొదురుపాక, గుండన్నపల్లి పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభం

**బోయిన్ పల్లి మండలం / జూన్ 3 ,(చట్టం బ్యూరో ) :** జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరం నుండి నూతనంగా మంజూరైన 48 పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో భాగంగా, బోయినిపల్లి మండలంలోని పీఎంశ్రీ బోయినిపల్లి, పీఎంశ్రీ కోరెం, పీఎంశ్రీ కొదురుపాక, పీఎంశ్రీ గుండన్నపల్లి పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నారు. ఈ నాలుగు పాఠశాలల్లో ఒక్కొక్కదానికి ఒక మహిళా బోధకురాలు, ఒక మహిళా ఆయాను నియమించేందుకు జిల్లా కలెక్టర్ అనుమతించారు. స్థానిక మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

**పోస్టుల వివరాలు:**

- బోధకులు: ఇంటర్మీడియట్ ం ప్రీ-ప్రైమరీ/ప్రైమరీ విద్యా బోధనా కోర్సు చేసినవారికి ప్రాధాన్యత. గౌరవ వేతనం: ?8000/-
- ఆయాలు: 7వ తరగతి ఉత్తీర్ణత. గౌరవ వేతనం: ?6000/-

వయస్సు: 18-44 ఏళ్లు. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్‌లకు 5 ఏళ్లు, మాజీ సైనికులకు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల సడలింపు.

దరఖాస్తు చివరి తేదీ: 09.06.2026 సాయంత్రం 5 గంటల లోపు బోయినిపల్లి ఎంఈఓ కార్యాలయంలో సమర్పించాలి.

పూర్తి వివరాలకు: https://www.sircilladeo.com

# ఆయిల్ పామ్, సన్న వడ్లు సాగు చేయడంపై రైతులు దృష్టి పెట్టాలి

- కొనుగోళ్ళు వేగవంతం చేసి పూర్తి చేయాలి
- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- వేములవాడ, వేములవాడ రూరల్, చందుర్తి, రుద్రంగి మండలాల్లో పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా/జూన్ 2 ,(చట్టం బ్యూరో) :** ఆయిల్ పామ్, సన్న వడ్లను సాగు చేయడంపై రైతులు దృష్టి పెట్టాలని, లాభదాయక పంటల సాగుకు ముందుకు రావాలని, వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కోరారు. గురువారం వేములవాడ మండలం బాలా నగర్, వేములవాడ రూరల్ మండలం వట్టెంల, ఫాజుల్ నగర్, చందుర్తి మండలం మల్యాల, రుద్రంగి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడి పంట మార్పిడి, లాభదాయక పంటల సాగుకు ప్రోత్సాహం, తదితర అంశాలపై చర్చించారు. తుది దశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం సేకరించారు అనే వివరాలను ఆరా తీశారు. తూకం వేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి తరలించి కొనుగోళ్ళు పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. రైతులు పంట మార్పిడిపై దృష్టి పెట్టి లాభదాయక పంటలను సాగు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తే మొక్కలు, డ్రిప్ కు ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందని తెలిపారు. సన్న వడ్లు, ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని కోరారు. ఆయిల్ పామ్ ను సాగు చేస్తున్న రైతుల అనుభవాలను తెలుసుకుని అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు.

# పవన్ కళ్యాణ్‌పై మరోమారు ప్రకశార్ రాజ్ సెటైర్లు

**ఘాటుగా తిప్పికొట్టిన నిర్మాత బండ్ల గణెళిశ్**

**హైదరాబాద్,జూన్4 :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అంశంలో నటుడు ప్రకాశ్ రాజ్, నిర్మాత బండ్ల గణెళిశ్ మధ్య సోషల్ మీడియా ఎక్స్‌లో వార్ నడుస్తోంది. తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై ప్రకాశ్ రాజ్ సెటైర్ వేస్తే.. ప్రకాశ్ రాజ్‌కు బండ్ల గణెళిశ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో జనసేన పోటీపై ఎక్స్‌లో పోస్ట్ చేసిన ప్రకాశ్ రాజ్.. పవన్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'మీరొస్తామంటే మేమొద్దంటామా.. రండి దొర. సింగిల్‌గా వస్తున్నారా.. పొత్తుతో వస్తున్నారా చెప్పి రండి' అని ప్రకాశ్ రాజ్ పోస్ట్ చేశారు. ప్రకాశ్‌రాజ్ పోస్ట్‌కు బండ్ల గణెళిశ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రతి దాంట్లో ఎందుకు వేలు పెడతావంటూ ప్రశ్నించారు. 'అసలు నువ్వెవరు.. తమిళోడివా? తెలుగోడివా? కన్నడిగుడివా? ప్రతి విషయంలో జడ్జిమెంట్ ఇవ్వడానికి నువ్వేమైనా ప్రధానివా. అందరి విషయాల్లో దూరి హీరోలా ఫీలవ్వకు. ముందు నీ అడ్రస్ నువ్వు తెలుసుకో. తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయ్' అంటూ ప్రకాశ్ రాజ్‌ను ఉద్దేశించి బండ్ల గణెళిశ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రకాశ్ రాజ్, బండ్ల గణెళిశ్ మధ్య సోషల్ మీడియా ఎక్స్ వేదికగా జరుగుతున్న వార్.. చర్చనీయాంశంగా మారింది.

# టూ వీలర్ స్కిడ్..దూసుకెళ్లిన బస్సు

**ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం**

**హైదరాబాద్,జూన్4 :** నగరంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఇదే ఓ విద్యార్థి ప్రాణాలు పోవడానికి కారణమైంది. సికింద్రాబాద్ పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలో కురిసిన వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఈ క్రమంలో బైకుపై వస్తున్న ఓ యువకుడు స్కిడ్ అయి.. అదే సమయంలో పక్కనే వెళ్తున్న ఆర్టీసీ బస్సు కిందికి దూసుకుపోయాడు. బస్సు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మార్కెట్ స్టేషన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు గురునానక్ కాలేజీలో బీటెక్ చదువుతున్న మదన్ మోహన్‌గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మదన్ మోహన్ అకాల మరణంతో అతని కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

# చట్టం సాహితీ లోకం
95814 19999

## " స్త్రీ ఆరోగ్యం కోసం కలసికట్టు" "వాస్తవికత్వం,కార్యాచరణతో మైలురాళ్ళు "

-మహిళల ఆరోగ్యం ఇంటికి సంపద, ప్రతి సంవత్సరం మే 28 వ తేదీ నాడు అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా పాటిస్తారు ,
-ఆరోగ్య సంరక్షణ, హక్కులు, అవగాహన కోసం అందరూ అంకితం దీని లక్ష్యం,
-మహిళా దినోత్సవం ను మార్చి8 న న్యూజిలాండ్ లో ఓటు హక్కు ప్రదానం, తర్వాత రష్యన్ విప్లవంలో మహిళల పాత్ర కీలకం,
-హింస,వివక్షలేని స్వేచ్ఛగా జీవించే హక్కు జారీ,
-భౌతిక,మానసికారోగ్యాన్ని పొందే సంరక్షణ హక్కు,విద్యను,వైద్య పరంగా అభ్యసించే. హక్కు, ఆస్తిని కలిగే హక్కు,ఓటుహక్కు,సమాన పనికి సమాన వేతనం పొందే హక్కు,
-లింగవివక్ష ,సమాజానికి స్త్రీలకు సమస్య ,
-లైంగిక, మరియు పునరుత్పత్తి ఆరోగ్యం,గర్భనిరోధక సాధనాలు ప్రజలకు అందుబాటు,
-సంతానోత్పత్తి,వంధ్యత్వం సంరక్షణ, ప్రసూతి, సంతానం,ప్రసవవేదన, ఆరోగ్యం,
-లైగింక మరియు లింగ ఆధారిత,గోప్యత నుండి రక్షణ,
-సురక్షితమైన ఆరోగ్యకర జీవన విధాన ప్రక్రియ,వైద్య,విద్య, పరిశోధనా ఫలితాలు ఫలాలు, అందుబాటు లోకి ప్రజలకు,
-ప్రభుత్వరంగం ప్రసూతి గైనకాలజిస్ట్ విస్తృత స్థాయిలో సేవలు,ప్రచారం,
-గృహహింస, శారీరక దాడి,సహజ ప్రసవానికి ప్రాధాన్యత, సెజెరియన్ తగ్గింపు,తొలగింపు,
-లింగ నిర్ధారణ,అనుమతి,ఆమోదం,లేని లింగభేదం నిషేధిత ఓషధాలు వినియోగం,
-గర్భిణీలు పరిణతి చెందిన తర్వాత ప్రసవ ప్రక్రియలో ఉండాల్సిన రక్తం శాతం,హీమోగ్లోబిన్, చర్యలు,
-స్వలింగ, విజాతి,సహజీవన, సంపర్కంలోసంక్రమించే సుఖ,చర్మ ,క్రిములు, వైరస్, నిర్మూలన ప్రభావం, పరిశీలన,చర్యలు,
-కేవలం ఒకే దినోత్సవ రోజు కాకుండా,జీవితాంతం ఆరోగ్య ప్రాధాన్యత, ఋతు క్రమ ఆరోగ్యం,సంతాన సాఫల్యం,పర్యవేక్షణ అవసరం,
-మోనోపాజ్ సాధారణ స్త్రీల ఆరోగ్య సంరక్షణ కోసం ఆందోళన, వత్తిడి వద్దు,
-స్పష్టత కోసం భరోసా కోసం నిపుణుల సలహా, సంప్రదింపులు ఉపేక్షితం,
-వాస్తవికత, సమానత, గౌరవం,ప్రేక్షకులను ప్రేరేపించే సందేశాలు,కార్యాచరణ అవసరం ఇదే మైలురాళ్ళు కావాలి,
-పొగాకు,మద్యం కు దూరంగా,పోషక ఆహారం,వ్యాయామంతో వత్తిడి లేకుండా ఉండాలి,
-ప్రపంచ ఆరోగ్య సంస్థ వన్ హెల్త్ దృక్పథాన్ని ఆచరణాత్మకంగా ఫ్రాన్సులో ప్రారంభించింది,
-ఆరోగ్యం కోసం కలసికట్టుగా,విజ్ఞానానికి అండగా ఉంటామన్న అధికార నినాదం రావాలి,
-నిద్రలేవగానే 30-30-30 నియమం పాటిద్దాం,నిద్ర లేచిన 30నిమిషాలు లోపు,30గ్రాముల ప్రోటీన్,30 నిముషాల వ్యాయామం ప్రతి స్రీ చేయాలి,
-40-70ఏళ్ల మధ్య వృద్ధాప్య ప్రక్రియ, అవయవ నెమ్మది పనితీరు,దీర్ఘాయుష్ పెంపు, కీళ్ళ నొప్పి,అంటువ్యాధులు,కండరాల పరిపుష్టి గురించి స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయం సలహాలు అవసరం,
-దస్సితనం,అలసట, గుండె,మధుమేహం గురించి ఫ్రెడెరిక్సన్ 2018 ఉపన్యాస,సలహాలు పాటిద్దాం,
-ప్రతినెల 3,5,7,నెలల్లోబిడ్డ కదలికలు, స్కానింగ్, తేదీ నిర్ణయం,అభిలషణీయం
-వైద్య, ఆర్థిక, నదుపాయాలు,ఓషధాలు,పిల్లలకు సహాయము, స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ అందజేస్తే పేద గృహిణులకు ఊరట పొందు...
-స్త్రీ ఆరోగ్య విద్య కోసం కలసికట్టుగా ముందుకు వెళదాం,
-మహిళల పట్ల ఆరోగ్య చరిత్ర మైళ్ళురాళ్ల కావాలి,పరిశోధనలు రావాలి..తేవాలి..
స్త్రీ ఆరోగ్యంగా ఉంటేనే ఉయ్యాల నుండి బయటకు మొయ్యాల..

- చందు ఆంజనేయులు, విశ్రాంత ప్రాచార్యులు, సామాజిక విశ్లేషకులు,



## దారి చూపే ..దైవం

( God Will Steer the Boat but you must Row)



నమ్మిన వారికి దైవం ఎల్లప్పుడూ
సహాయంగా, తోడుగా..
ఉంటాడు. దేవుని మించిన మంచి
హితుడు, స్నేహితుడు లేడు.

దేవుడు.. మార్గదర్శి మాత్రమే.
ఎలా నడవాలో, ఎలా గెలవాలో
ఆయన దారి చూపుతాడు.
నిన్ను సన్మార్గంలో, సత్య మార్గంలో నడిపిస్తాడు.

నమ్మిన వారిని దేవుడు ఏనాడూ
దూరం చేసుకోడు. దూరం గా ఉంచడు.
దైవారాధన..దేవుని చేరే దగ్గరి మార్గం.
దైవ ప్రార్థన.. హృదయ నివేదన లాంటిది.

మంచి మనసు, మంచి మార్గం
దేవుడు చూపే తోవ..!
చెడు వర్తన, ప్రవర్తన
నరకానికి దగ్గరి దారులు.

కేవలం.. ప్రార్థిస్తే చాలదు.
మనసా, వాచా ఆచరించాలి..
అనుసరించాలి అప్పుడే
సత్పరిణామాలు సంభవిస్తాయి.

నీవు ప్రయాణించే పడవను
నీవే నడపాలి..దేవునిపై భారం వేసి
తెడ్డును వదిలేస్తే..పడవ బోల్తా పడుతుంది.
దైవం.. చుక్కాని..మార్గం చూపే" లైట్ హౌస్".

విజయకుమార్ గడియా
బెంగుళూరు.

## కర్తవ్యం! బాధ్యత! నాణెంకి రెండు వైపులు!అవివేరు,వేరు

విధి నిర్దేశించేవి కర్తవ్యాలు! మనిషి నెత్తికెత్తుకునేవి బాధ్య తలు! కర్తవ్యాలకు ముగింపు ఉండు! బాధ్యతలకు కొనసా గింపు ఉండు! వివేకులు కర్త వ్యాలు పూర్తి చేస్తారు! మిగిలి న వారు బాధ్యతల్లో మునిగి తేలుతుంటారు! రామాయణ మహాభారతాలే ఉదాహరణ!


రామాయణంలో విధి నిర్దేశిం చిన కర్తవ్యం, లోక కళ్యాణం! సీతారామ కళ్యాణం! దానికి కర్త గురువు విశ్వామిత్రుడు!
తాటక వధతో రాక్షస వైరానికి పురికొల్పి,ధనుర్వేదం, బల అతి బల మంత్రాలు నేర్పి శివ ధనుర్భంగంతో సీతాపరిణ యంతో తన కర్తవ్యం పూర్తి చేసి వెనుతిరిగాడు! మిగిలిన ది రాముడే పూర్తి చేశాడు!

ఆగస్త్య మహర్షి ఆదిత్య హృదయం ద్వారా రావణ సంహారానికి కర్తవ్య బోధన చేశాడు! తదుపరి బాధ్యత రాముడే నిర్వహించారు!

పిల్లలను పెంచి పెద్ద చేసి సంస్కారాన్ని విద్యాబుద్ధులు నేర్పించడం వరకు తల్లిదండ్రుల కర్తవ్యం! పెరిగి పెద్దయివారి జీవితాల్లో స్థిరపడడంబాగోగు లు అనేవి వారి బాధ్యత!


కర్తవ్యాలు సంతృప్తికి,బాధ్య తలు అశాంతికి కారణాలు! ఆ తేడాను గుర్తిస్తే జీవితాలు సుఖశాంతుల మయం!బేధం!
కర్తవ్యం డిటేచ్మెంట్! బాధ్యత అటాచ్మెంట్! తెలుసుకోవాలి!

డాక్టర్ ప్రాత రాజశేఖర్, ప్రభుత్వ విశ్రాంత గురుకుల ఉపాధ్యాయులు, చోడవరం.




# చట్టం సాహితీ లోకం
95814 19999

## మనో విమర్శ



పొరపాట్లు అందరూ చేస్తూనే ఉంటారు
ఆ పొరపాట్లు అగచాట్లుగా మారకుండా
చేసిన తప్పులను మనస్సాక్షి చెబుతూనే ఉంటుంది కావున
నీ మనస్సాక్షికి సమాధానం చెప్పుకోవాలి
చేసిన తప్పులను ఒప్పుకోవాలి
మనసులోని మాలిన్యాన్ని ఎప్పటికప్పుడు కడిగి వేసుకోవాలి
మనసును స్వచ్ఛంగా ఉంచుకోవాలి
మనోవేతల పాలు కాకుండా ఉండాలి
ఆత్మ పరిశీలన అన్నది అద్భుతమైనది
గుండె గదుల్ని ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి
గతం నుంచి పాఠాలు నేర్చుకోవాలి
నవ్వుతూ అందరితో గడపగలగాలి
నువ్వు మాట పద్దా తేట నీరులా ఉండాలి
మానవ జన్మ అన్ని జన్మలకన్నా అత్యుత్తమం అన్నది తెలుసుకోవాలి
క్షమాగుణం నేర్చుకోవాలి
కోరికల నియంత్రణ మార్గం వెతకాలి
స్వలాభాన్ని వీడి ఇతరులకు సహాయపడాలి
కష్టాలు అందరికీ ఉంటాయి
అంతరంగాన్ని అదుపులో ఉంచుకొని
ఆలోచనతో ముందుకు నడవాలి
అప్పుడే జీవితానికి దొరుకుతుంది చక్కటి పరిష్కారం
మనో నిబ్బరంతో ముందుకు వెళుతూ
గడపాలి చక్కని జీవితం

పేరు:- రవీంద్రబాబు అరవా
ఊరు:- హైదరాబాద్



# చట్టం సాహితీ లోకం
95814 19999

## కనిపించని గాయం



మనసులో మిగిలిన మాటలే
మౌనంగా రక్తమై కారుతుంటాయి.

కళ్లలో నవ్వు మెరిసినా
గుండెల్లో వానలు కురుస్తుంటాయి.

ఎవరికీ కనిపించని బాధ
ప్రతి రాత్రీ నిద్రను దోచుకుంటుంది.

ఆప్యాయత కోసం ఎదురుచూసే హృదయం
ఒంటరితనంతో ముడుచుకుపోతుంది.

గాయం శరీరానికైతే మానిపోతుంది
మనసుకైతే జ్ఞాపకమై నిలుస్తుంది.

చెప్పాలనుకున్న బాధలు
పలుకుల దారి కనపడక మౌనమవుతాయి

కాలం ముందుకు నడిచినా
ఆ నొప్పి వెనకనే నడుస్తుంది.

ప్రపంచం "బాగున్నావా?" అంటుంది
మనసు మాత్రం నిశ్శబ్దంగా ఏడుస్తుంది.

కనిపించని గాయం అయినా
అది మానవ హృదయపు నిజమైన కథే.

పాల.కుమారస్వామి (రవి)
కవి,రచయిత,
సామాజిక విశ్లేషకులు
సెల్:9032131427
వరంగల్

# చట్టం సాహితీ లోకం
95814 19999

## మన ఆరోగ్యం మన చేతిలోనే



మన ఆరోగ్యం మనచేతిలోనే
ఉంటుందనడం ఎంతో నిజం
మన సోమరితనంతోనే అనారోగ్యం
కలుగుతుందన్నది పరమ సత్యం

వేకువనే లేవాలి తప్పని సరి
ఏ వయసు వారైనను సరే
ఉదయం నడక ఒనరించినను
ఒంటికెంతో ఆరోగ్యం కలుగును

వేళ్ళకు తప్పక భుజించాలి
పరిమితంగానే తినవలయు
శాఖాహారం ఒంటికి మంచిది
చిరుదాన్యాలు ఎంతో మేలు

దురలవాట్లకు దూరముండాలి
దేనికైనా సరే బానిస కాకూడదు
దూమపానం మాని వేయాలి
మద్యమును తీసుకొన కూడదు

ఉదయమే వీలైతే ఎండలో కూర్చోవాలి
యోగా లేదా ధ్యానం తప్పక చేయాలి
ఆరేడు గంటలకు మించి నిద్రపోరాదు
భక్తితో ఇష్టదైవాన్ని ఆరాధించాలి

రుచిగా ఉందని అధికంగా తనరాదు
బి పి షుగరుందని చింతపడ వలదు
పై నియమాలతో ఆవి అదుపులోనుండు
ఆశా మోహములను తగ్గించుకొనుడు

వయసు పెరిగిందని నిర్లక్ష్యం చేయకు
అరవైలో ఇరవైలా జీవించ వలయు
వయసు శరీరానికే కాని మనసుకు కాదు
ఉత్సాహంతో నీ పనులు నీవే చేసుకో

అరవై దాటిందని ఊరికే తిని కూర్చోకు
ఏదో ఒక మంచి వ్యాపకం చూసుకో
వృత్తి చేయకున్నా నీ ప్రవృత్తిని మానకు
నీకున్న అభిరుచిని అభివృద్ధి పరచుకో
ఉన్నదానితో సంతృప్తి పడి
చీకు చింత లేక బతుకును సాగించు

అక్కి నర్సింలు గౌడ్
విశ్రాంత ఉపాధ్యాయుడు
మల్లాపూర్ రంగారెడ్డి జిల్లా
కవి గాయకుడు

# చట్టం సాహితీ లోకం
95814 19999

## ఒక నిశ్శబ్ద భాష



కన్నీళ్లు బలహీనతకు గుర్తుకాదు
మోయలేనంత బాధకు
అవి ఒక నిశ్శబ్ద భాష
ఎవరి ముందు పడితే
వాళ్ళ ముందు ఏడ్చినా
మన బాధను చులకన చేస్తారు
అందుకే మన కన్నీటి విలువ
తెలిసిన వారి దగ్గరే మనసు విప్పాలి
లేదంటే మౌనంగా మనం
భరించడమే మేలు
అవమానాలే ఆయుధాలుగా
చేసుకొని నిలబడు
ఎవరైతే నిన్ను పనికి రావని
హేళన చేస్తారో వారి ముందే
నువ్వు తలెత్తుకొని నిలబడేలా
పైకి ఎదిగి చూపించాలి
నీకు జీవితంలో ఎదురయ్యే
ప్రతి అవమానం మనలోని
కసిని పెంచే ఒక ఆయుధంలా
నువ్వు మార్చుకోగలగాలి
సాధించాలన్న తపన ముందు
ఎన్ని అడ్డంకులు వచ్చినా సరే
అవి నీ సంకల్పం ముందు
చిన్నబోవాల్సిందేనని గ్రహించు!

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385

# చట్టం సాహితీ లోకం
95814 19999

## అవగాహనా లోటు



కళ్ళున్నా చూడలేని గ్రుడ్డితనం ఇది,
నిజానిజాలు దాచేసే ఒక మాయా తెర ఇది.

తెలుసుకోవాలనే తపన కరువైన వేళ,
అజ్ఞానపు చీకటిలో సాగుతోంది ఈ లీల.

?వినడం మానేసి వాదించడం ఎక్కువైంది ఈ రోజుల్లో
అర్థం చేసుకోక ముందే నిందలు వేయడం అలవాటైంది.

చదివిన చదువుకు సంస్కారం తోడవకపోతే,
తెలివి కూడా వ్యర్థమే, విచక్షణే లేకపోతే.

?వార్తల వెనుక ఉన్న వాస్తవం చూడరు,
కల్పిత కథలను సైతం నిజమని నమ్ముతారు.

సగం నాలెడ్జ్ ఎప్పుడూ ప్రమాదకరం అని తెలుసుకోక,
ఆ సగంతోనే లోకాన్ని శాసించాలనుకుంటారు.

?ఒకరి మనసును చదివే ఓపిక లేదు,
సహానుభూతి చూపే హృదయం ఎక్కడా కానరాదు.

మాటల వెనుక ఉన్న మర్మాన్ని గ్రహించరు,
తొందరపాటు నిర్ణయాలతో బంధాలు తెంచుకుంటారు.

?విజ్ఞానపు వెలుగులు విరజిమ్ముతున్న ఈ కాలాన,
అవగాహన లోపించడం పెద్ద విచిత్రం కాదా?

ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలి,
ప్రతి విషయాన్ని విశ్లేషించి చూడాలి.

?తెలుసుకుందాం అనే ఆశే ప్రగతికి బాట,
సమగ్ర అవగాహనే మన విజయాలకు బాట.

అజ్ఞానపు పొరలను వీడి ముందుకు సాగుదాం,
నిజమైన జ్ఞానంతో నవసమాజాన్ని నిర్మిద్దాం!

తెలికిచెర్ల రాజ కృష్ణ కామేశ్వర రావు
రిటైర్డ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్,
భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ,
ఇస్రో, షార్, శ్రీహరికోట
సూళ్లూరుపేట / తిరుపతి జిల్లా

# చట్టం సాహితీ లోకం
95814 19999

## కలలు కరిగిపోతాయి.

మానవులకు కలలు రావడం అనేది , అత్యంత సహజం.
ఆ కలలు తదుపరి రోజుకు కరిగిపోవడమూ అంతే సహజము.
కానీ కలలు మిగిలిస్తాయి, మనకు కొన్ని తీపి అనుభవాలు.
కొన్ని నిజంగా కలిగినట్లు ఉంటాయి, వివిధ అనుభూతులు.
కలలకు అపుడపుడూ మొలుస్తాయి, పక్షులలా ఎగిరే రెక్కలు.
కలాన్ని చేతబట్టి రాయాలని చూస్తే మరపులోనికి, కలల అనుభవం.
కనురెప్పల మాటున దాగిన ఒక అందమైన అనుభూతుల సమాహారం.
అందమైన కలలను రాయలేని చేదు గురుతు, కలము అనుభవం.
తన ఆలోచనల మథనంతో మానవునికి కలలుగ సుప్త చైతన్యం.
మానవుని ఆలోచనా విధానము, అతని కోరికలే కలలంటాడు, ఫ్రాయిడు.
నీటిలో మునిగినట్లు, గాలిలో ఎగిరినట్లు, యుద్ధాలు చేసినట్టు ఏవో దృశ్యాలు.
తిండి దొరకని పేదవానికి కూడా డబ్బు తెచ్చే సౌకర్యాల అనుభూతులు, కలలు.
బలమైన నిద్రావస్థలో మనిషి భావోద్వేగాలు కలలౌతాయని అన్నాడతడు.
మెదడుపై పెరిగిన కలతల బరువు, భయాలే అతని స్వప్నాలు.
ఒక వ్యక్తిపై, వస్తువుపై పెరుగుతున్న ఆపేక్ష కూడా బయటపెట్టే అస్త్రాలు.
కొన్ని కలలు నిరాశతో ఉంటే, మరికొన్ని వెలిగిస్తాయి , ఆశల దీపాలు.
కొన్ని భయపెట్టే పీడకలలు, కొన్ని మేలుకొనే కనే పగటి కలలు.
కొన్ని తమకు కల వస్తుందని తెలిసి, అనుభవించే లూసిడ్ కలలు.
మెదడులోని నాడీకణాల కదలికలే యాదృచ్ఛికంగ కలలని సైంటిస్టుల కలానుభవం.
కొన్ని కలలు భవిష్యత్తులో శుభ, అశుభాలను సూచిస్తాయని కలం అనుభవం.
కలలు నిదురలోనే మనలను తెలియని లోకంలో విహరింపజేసే విహంగాలు.
మన తీరని కోరికలను తీరినట్లు అనుభూతింపజేసే మాయాజాల మనసు అద్దాలు.

రచన:ముక్కా సత్యనారాయణ
పెనుగంచిప్రోలు, ఎన్టీఆర్ జిల్లా



# సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా


'బుక్ మై షో'లో గంటకు 40వేల టికెట్స్ బుక్




ప్రస్తుతం సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా కనిపిస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా వాటిని అందుకొని హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకువచ్చిన విషయం తెలిసిందే. రిలీజ్‌కు ముందు నుంచే టికెట్ బుకింగ్స్‌లో జోరు చూపిన చిత్రం విడుదల అనంతరం కూడా అదే కొనసాగిస్తోంది. ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్ 'బుక్ మై షో'లో 'పెద్ది'కు గంటకు 40వేల టికెట్స్ బుక్ అవుతున్నాయి. 2023లో బుక్‌మై షో ప్రవేశపెట్టిన 'అవర్లీ ట్రెండింగ్' ఫీచర్ తర్వాత.. ఈ 40 వేల మార్క్‌ను దాటిన చిత్రాల జాబితాలో ఇప్పటివరకు మూడు సినిమాలు మాత్రమే ఉన్నాయి. కల్కి 2898 ఏడీ, సలార్, పుష్ప తర్వాత స్థానంలో 'పెద్ది' నిలిచింది. మొదటిరోజే ఈ మార్క్‌ను చేరుకొని రికార్డు సృష్టించింది. కర్ణాటకలో జరిగిన ప్రీమియర్ షోల ద్వారా 'పెద్ది' భారీ వసూళ్లను సాధించి, టాలీవుడ్‌లోని పలు అగ్రహీరోల చిత్రాల రికార్డులను తిరగరాసింది. ప్రీమియర్స్‌లో రూ.3.2 కోట్లు వసూలు చేసినట్లు సినీ వర్గాలు తెలిపాయి. దీంతో అక్కడ ప్రీమియర్ కలెక్షన్స్ సాధించిన మొదటి తెలుగు సినిమాగా నిలిచింది. గతంలో విడుదలైన 'ఓజీ' (రూ.2.72 కోట్లు), 'రాజా సాబ్' (రూ.2.61 కోట్లు), పుష్ప 2 (రూ.2.55 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాలో పాటలు కూడా సూపర్ హిట్‌గా నిలిచాయి. ముఖ్యంగా 'చికిరి చికిరి' పాట విడుదలైన రెండు వారాలకే 10 కోట్లకు పైగా వ్యూస్‌తో ట్రెండింగ్‌లో నిలిచింది. అయితే, ఈ పాట లిరిక్స్‌లో 'సరుకూ సామాన్లు' అనే పదంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో టీమ్ ఈ పదాన్ని మార్చినట్లు తెలుస్తోంది. థియేటర్‌లలో దీనికి బదులుగా 'సొగసు సింగారం' అని చేర్చారని నెటిజన్లు పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ స్పోర్ట్స్ డ్రామాకు ఏఆర్ రెహమాన్ సంగీతం హైలైట్‌గా నిలిచింది




# దురంధర్ సరికొత్త రికార్డులు





## మూవీ విజయంపై అంబానీ హర్షం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ హీరోగా జియో స్టూడియోస్ నిర్మించిన 'ధురంధర్' ఫ్రాంచైజీ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించిన విషయం తెలిసిందే. ఈ చిత్రం సాధించిన అసాధారణ విజయంపై రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ హర్షం వ్యక్తంచేశారు. జియో స్టూడియోస్ సాధించిన విజయాలను అభినందిస్తూ లేఖ రాశారు. 2024లో 'స్త్రీ 2', 2025లో 'ధురంధర్', 2026లో 'ధురంధర్: ది రివెంజ్' చిత్రాలతో జియో స్టూడియోస్ వరుసగా మూడేళ్లపాటు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలను అందించి ఒక అరుదైన మైలురాయిని అందుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జియో స్టూడియోస్ విడుదల చేసిన స్పై యాక్షన్ థ్రిల్లర్స్ 'ధురంధర్', 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ కలెక్షన్లలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణలో సరికొత్త బెంచ్‌మార్క్‌లను క్రియేట్ చేశాయి' అని లేఖలో పేర్కొన్నారు. ఈ సిరీస్‌లో వచ్చిన మొదటి భాగం, భారతీయ సినిమా చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచి సరికొత్త రికార్డు సృష్టించిందని ముకేశ్ అంబానీ తెలిపారు. థియేటర్లలో 15 వారాల పాటు హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించాయన్నారు. ఆ తర్వాత భారీ అంచనాల మధ్య విడుదలైన రెండో భాగం.. మొదటి సినిమా నెలకొల్పిన రికార్డులన్నింటినీ బద్దలు కొట్టిందని తెలిపారు. ఇది తిరుగులేని విజయమని వ్యాఖ్యానించారు. ఈ సినిమాలు రూ.3000 కోట్లకు పైగా వసూళ్లు సాధించి.. మొత్తం దేశ థియేట్రికల్ ఆదాయంలో 40శాతం వాటాను దక్కించుకున్నాయని ప్రశంసించారు.

## శ్రీవారిని దర్శించుకున్న జాన్వీకపూర్

తిరుమల శ్రీవారిని సినీ నటి జాన్వీ కపూర్ దర్శించుకున్నారు. బుధవారం అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు చేరుకున్న జాన్వీ.. గురువారం ఉదయం నటి మహేశ్వరితో కలసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. జాన్వీ కపూర్, రామ్‌చరణ్ జంటగా నటించిన 'పెద్ది' ఇవాళ విడుదలైన విషయం తెలిసిందే.




# నా మనసంతా పెద్ది చుట్టే తిరుగుతోంది

### పొలాచ్చి లో ఉండిపోవడంతో రాలేక పోయా

### పెద్ది విజయంపై చిరంజీవి అభినందనలు


తాను షూటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా తన మనసంతా 'పెద్ది' దగ్గరే ఉందని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' నేడు ప్రేక్షకుల ముందుకువచ్చి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఒక తండ్రిగా, నటుడిగా తనకెంతో గర్వంగా ఉందంటూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. ఈసందర్భంగా చిత్రబృందాన్ని అభినందించారు. నేను షూటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా కూడా నా మనసంతా 'పెద్ది' దగ్గరే ఉంది. గత రెండేళ్లుగా ఈ సినిమా కోసం చరణ్ పడిన కష్టం, పెట్టిన శ్రద్ధాసక్తులు అన్నీ దగ్గర నుంచి చూశాను. ఈ రోజు ప్రేక్షకుల ప్రేమ, ప్రశంసలు చూస్తుంటే ఒక తండ్రిగా మాత్రమే కాదు, ఒక నటుడిగా కూడా ఎంతో గర్వంగా అనిపిస్తోంది. 'పెద్ది' పాత్రలో పూర్తిగా లీనం కావడానికి తను అహర్నిశలు చేసిన కృషి, పట్టుదల, నిజాయతీ ప్రతి సన్నివేశంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ కష్టానికి దక్కిన ప్రతిఫలమే ఈ విజయం అని రామ్ చరణ్‌ను చిరంజీవి ప్రశంసించారు. ఇలాంటి అద్భుతమైన కథను రాసి, అంతే అద్భుతంగా తెరపై ఆవిష్కరించిన దర్శకుడు బుచ్చిబాబుకు ప్రత్యేక అభినందనలు. అలాగే తన తొలి చిత్రాన్నే ఇంత భారీ స్థాయిలో, ఎలాంటి రాజీ లేకుండా నిర్మించిన నిర్మాత వెంకట సతీశ్ కిలారుకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నటించిన నా



మిత్రుడు, 'కరునాడ చక్రవర్తి' శివరాజ్ కుమార్‌కు, అప్పలసూరి పాత్రలో అద్భుతంగా జీవించిన నా సోదర సమానుడు జగపతిబాబుకు అభినందనలు. అద్భుతమైన పాటలు, హృదయాన్ని కదిలించేలా నేపథ్య సంగీతాన్ని అందించిన ఏఆర్ రెహమాన్‌కు ప్రత్యేక అభినందనలు. ఈ సినిమా విజయంలో భాగమైన జాన్వీ కపూర్ , దివ్యేందుతో పాటు సాంకేతిక నిపుణులందరికీ కంగ్రాట్స్..' అంటూ చిత్రబృందాన్ని అభినందించారు. 'పెద్ది' సాధించిన ఈ ఘన విజయం తెలుగు సినిమాకి గర్వంగా నిలవాలని, మరెన్నో మైలురాళ్లు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

### పెద్ది థియేటర్‌లో ఉపాసన హంగామా


తన ఆటలతో అభిమానులకు ఫుల్ ట్రీట్ ఇచ్చాడు రామ్ చరణ్. ఆయన హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' థియేటర్‌లలో సందడి చేస్తోంది. ఈ చిత్రం ప్రీమియర్స్‌లో రామ్ చరణ్ భార్య ఉపాసన ఎంజాయ్ చేశారు. హైదరాబాద్ బాలానగర్‌లో స్పెషల్ స్క్రీనింగ్‌కు వచ్చిన ఉపాసన , అభిమానుల మధ్య సినిమా చూసి వారిలో ఉత్సాహం నింపారు. రామ్ చరణ్ ఎంట్రీ సమయంలో పేపర్‌లు ఎగరేసి జోష్ పెంచారు. ఫ్యాన్స్‌తో పాటు ఆమె కూడా ఉత్సాహంగా అరుస్తూ కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇక పెద్ది హిట్ టాక్ రావడంతో థియేటర్‌ల వద్ద పండగ వాతావరణం నెలకొంది. రామ్ చరణ్ నటనను ప్రశంసిస్తూ సెలబ్రిటీలు పోస్ట్‌లు పెడుతున్నారు. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందంటూ అభినందిస్తున్నారు.






## ప్రశాంత్ నీల్‌కు ఎన్టీఆర్ బర్త్‌డే విషెస్

ఇండియన్ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ పుట్టినరోజు సందర్భంగా అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత్ నీల్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని, అలాగే వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోయే డ్రాగన్ సినిమాను గుర్తుచేస్తూ.. ఎన్టీఆర్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ట్వీట్‌లో ఎన్టీఆర్ స్పందిస్తూ.. 'పుట్టినరోజు శుభాకాంక్షలు డైరెక్టర్ గారూ.. మీరు చెప్పే కథలంత గొప్పగా ఈ ఏడాది మీకు సాగాలని కోరుకుంటున్నాను. మన కాంబినేషన్‌లో రాబోయే ప్రాజెక్ట్ కోసం, మన భవిష్యత్తు ప్రయాణం కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను ప్రశాంత్ అంటూ ఎన్టీఆర్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో ప్రశాంత్ నీల్‌ను ఉద్దేశించి ఎన్టీఆర్ కన్నడ పదం 'అవరే' (గారూ) అని సంబోధించడం ఇరు భాషల అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి ఇండస్ట్రీ హిట్ చిత్రాలతో సంచలనం సృష్టించిన ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో రాబోయే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ డ్రాగన్ పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.




# త్వరలోనే ఇరుముడి థీమ్ సాంగ్ విడుదల

మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'ఇరుముడి' నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఒక సాలిడ్ అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటికే ఈ మూవీ నుంచి గ్లింప్స్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి ఒక ప్రత్యేకమైన సాంగ్ అప్‌డేట్‌ను మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా పంచుకున్నారు. గత కొన్ని రోజులుగా అభిమానుల నుంచి వస్తున్న భారీ రిక్వెస్ట్‌లను పరిగణనలోకి తీసుకుని, ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ 'ఇరుముడి' థీమ్ సాంగ్‌ను త్వరలోనే విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ పాట 'విల్లాది వీరుడు వీర మణికంఠుడు' అనే పవర్‌ఫుల్ అయ్యప్ప స్వామి భక్తి గీతంగా ఉండబోతోందని తెలుస్తుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, ఇందులో రవితేజ ఒక ఎమోషనల్ తండ్రి పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. కూతురి కోసం ఒక తండ్రి పడే తపన, మద్యపానానికి దూరమై అయ్యప్ప దీక్ష స్వీకరించి ఆధ్యాత్మిక మార్గంలో సాగే ఒక ఎమోషనల్ అండ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా కథాంశం ఉండబోతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కూతురిగా కీలక పాత్ర పోషిస్తోంది. స్టార్ మ్యూజిక్



డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఆగస్టులో థియేటర్లలోకి రానుంది.




# కమిన్స్ ఐపీఎల్ 2027కు దూరమయ్యే అవకాశం!?



సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఐపీఎల్ 2027కు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది జరగబోయే ప్రతిష్టాత్మక ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027తో పాటు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, యాషెస్ సిరీస్ లాంటి బిజీ షెడ్యూల్ ఆస్ట్రేలియాకు ఉండటంతో, పనిభారం తగ్గించుకునేందుకు ఐపీఎల్‌కు బ్రేక్ ఇవ్వనున్నట్లు కమిన్స్ హింట్ ఇచ్చాడు. ఒకవేళ కమిన్స్ దూరమైతే, ఐపీఎల్ 2026లో తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించిన ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ పూర్తిస్థాయి సారథిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులను ఆందోళన కలిగించే వార్త ఒకటి వెలుగులోకి వచ్చింది. జట్టు కెప్టెన్, స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్ .. ఐపీఎల్ 2027 సీజన్‌కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అతడి స్వయంగా హింట్ ఇచ్చాడు. భవిష్యత్‌తో అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్ బిజీగా ఉందని.. దీంతో పనిభారం దృష్ట్యా.. ఐపీఎల్ 2027కు దూరమయ్యే అవకాశం ఉందని చెప్పుకొచ్చాడు.కాగా ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు.. వచ్చే 18 నెలలు కీలకం కానుంది. ఈ గ్యాప్‌లో ఆస్ట్రేలియా జట్టు.. ప్రతిష్టాత్మకమైన యాషెస్ సిరీస్, భారత్‌లో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, ఆ తర్వాత వన్డే ప్రపంచకప్ 2027 ఆడాల్సి ఉంది. ఒకవేళ పాయింట్ల పట్టికలో టాప్-2లో నిలిస్తే.. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ కూడా ఆడాల్సి రావచ్చు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఉన్న ప్యాట్ కమిన్స్.. ఈ టోర్నీలు అన్నింట్లో ఆడాలని భావిస్తున్నాడు. దీంతో అవసరమైతే ఐపీఎల్ 2027కు దూరమయ్యేందుకు సిద్ధమయ్యాడు. “వచ్చే ఏడాది ఏదో ఒక దశలో నేను కచ్చితంగా ఒక టోర్నీకి దూరం కావాల్సి ఉంటుంది. అయితే అది దేశం తరఫున ఆడే టెస్ట్ మ్యాచ్‌లు లేదా వన్డే ప్రపంచకప్ మాత్రం కాదు. సమయం వచ్చినప్పుడు నేను నా ఐపీఎల్ ఫ్రాంచైజీ (సన్‌రైజర్స్ హైదరాబాద్)తో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటాను. ప్రస్తుతానికైతే దీనిపై నేను ఇంతకంటే ఎక్కువ క్లారిటీ ఇవ్వలేను. ఎందుకంటే పరిస్థితులు మారవచ్చు లేదా గాయాలు కూడా కావచ్చు” అని పత్రికతో మాట్లాడుతూ కమిన్స్ వ్యాఖ్యానించాడు. కాగా ఐపీఎల్ 2026లో కొన్ని మ్యాచ్‌లకు ప్యాట్ కమిన్స్ దూరమయ్యాడు. దీంతో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సారథిగా ఇషాన్ కిషన్ వ్యవహరించాడు. కమిన్స్ వచ్చాక అతడే సారథ్య పగ్గాలు చేపట్టాడు. ఈ సీజన్‌లో సన్ రైజర్స్ టాప్-4లో నిలిచింది. అయితే ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓడి.. టోర్నీ నుంచి నిష్క్రమించింది. వచ్చే సీజన్‌లో కమిన్స్ అందుబాటులో లేకపోతే.. ఇషాన్ కిషన్ పూర్తిస్థాయి సారథిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

# వచ్చే ఏడాది మార్చి 15 నుంచే ఐపీఎల్??



వచ్చే ఏడాది నుంచి ఐపీఎల్? షెడ్యూల్? మారనుందా? మార్చి 15 నుంచే టోర్నీ మొదలుకానుందా? మ్యాచ్?ల సంఖ్య కూడా భారీగా పెరగనుందా? మీడియాలో వస్తున్న ఈ వార్తలపై బీసీసీఐ బోర్డు కార్యదర్శి దేవజిత్? సైకియా తాజాగా క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతానికి ఐపీఎల్? విండో మార్పు గురించి పెద్దగా ఆలోచించడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బీసీసీఐ ఐపీఎల్? మ్యాచ్?లకు, ప్రేక్షకులకు ఇబ్బంది కలిగిస్తున్న వాతావరణ సవాళ్లను ఎదుర్కోవడంపై మాత్రమే దృష్టి పెట్టిందని స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండలు, వర్షాల వల్ల మ్యాచ్?లకు అంతరాయం కలగకుండా వచ్చే సీజన్? నుంచి టోర్నమెంట్?ను రెండు వారాల ముందే ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఏడాది (2026) ఐపీఎల్? మార్చి 28న ప్రారంభం కాగా, కొన్ని మ్యాచ్?లపై వర్షం ప్రభావం పడింది. ముఖ్యంగా కోల్?కతా నైట్? రైడర్స్? వర్సెస్? పంజాబ్? కింగ్స్? మధ్య జరగాల్సిన ఒక మ్యాచ్ ఫలితం తేలకుండానే? వర్షార్పణం అయ్యింది. మరోవైపు వేసవి ఎండల తీవ్రత వల్ల మైదానంలోని ఆటగాళ్లు, స్టేడియంలోని ప్రేక్షకులు చాలా ఇబ్బందులు పడ్డారు. టోర్నమెంట్ జరిగే సమయంలో ఇలా వేసవి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోవడంపై బీసీసీఐ ఆందోళన చెందుతోంది. ఓ ప్రముఖ మీడియాతో బీసీసీఐ బోర్డు మెంబర్? దేవజిత్ సైకియా మాట్లాడుతూ, ఐపీఎల్ మ్యాచ్?ల సంఖ్యను 74 నుంచి 94కు పెంచుతారనే ప్రచారాన్ని కొట్టిపారేశారు. “బీసీసీఐ ఈ అంశాన్ని అంత సీరియస్?గా తీసుకోవడం లేదు. ఎందుకంటే, గతంలో లాగానే ఈ ఏడాది కూడా ఐపీఎల్ రెండు నెలల కంటే ఎక్కువ కాలం సాగింది. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే, ఈ ఏడాది 2 నెలల 2 రోజులపాటు టోర్నమెంట్? జరిగింది. అయితే ప్రస్తుతం బీసీసీఐ బోర్డు మ్యాచ్?ల సంఖ్య కంటే, వాతావరణ పరిస్థితులపైనే ప్రధానంగా దృష్టి సారించింది” అని దేవజిత్ సైకియా పేర్కొన్నారు. ‘గతేడాది ఐపీఎల్ ప్రారంభమైన తర్వాత,? మధ్యలో ఒక వారం పాటు టోర్నమింట్?ను నిలిపివేశారు. దీనితో లీగ్? కొద్దిగా పొడిగించబడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మాకు ఉన్న ఆందోళన ఏమిటంటే, టోర్నమెంట్? మే 31 వరకు సాగితే, వర్షాల వల్ల కొన్ని మ్యాచ్?లపై ప్రభావం పడే అవకాశం ఉంది. మరికొన్ని మ్యాచ్?లపై ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువగా ఉండే ఛాన్సుంది’ అని ? దేవజిత్ సైకియా అభిప్రాయపడ్డారు. తీవ్రమైన ఎండలు, ముందస్తు వర్షాల (ప్రీ-మాన్?సూన్) ప్రభావం పడకుండా ఉండడం కోసం ఐపీఎల్? షెడ్యూల్?ను కాస్త ముందుకు జరిపి, మే నెల మధ్య నాటికే టోర్నమెంట్?ను ముగించే అవకాశాలను బీసీసీఐ పరిశీలిస్తోందని సైకియా స్పష్టం చేశారు. “మేము ఐపీఎల్?ను మరో 15 రోజులు ముందుకు తీసుకువచ్చే మార్గాలను అన్వేషిస్తున్నాం. ఈ ఏడాది మేము మార్చి 28న టోర్నీని ప్రారంభించాం. కానీ వచ్చే సీజన్? నుంచి కాస్త ముందుగా, అంటే బహుశా మార్చి 15 నాటికే ఐపీఎల్?ను ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నాం. మేము ఇప్పటికే దీనిపై కసరత్తు ప్రారంభించాం. మే 15 కల్లా టోర్నమెంట్?ను ముగించాలని చూస్తున్నాం. దీని వల్ల వేడి వాతావరణం లేదా వర్షాల ప్రభావం అటు ఆటగాళ్లపై, ఇటు స్టేడియానికి వచ్చే వీక్షకులపై, అభిమానులపై పడకుండా ఉంటుంది” అని సైజికా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఐపీఎల్? మ్యాచ్?ల సంఖ్య పెంచుతారా, లేదా? అనే ప్రశ్నకు సైకియా తనదైన రీతిలో సమాధానం చెప్పారు. ఐపీఎల్? మ్యాచ్?ల విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోవాలన్నా, అది పూర్తిగా అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్?, ఫ్యూచర్? టూర్స్ ప్రోగ్రామ్? (ఎఫ్?టీపీ) నిబంధనలపై ఆధారపడి ఉంటుందని సైకియా స్పష్టం చేశారు. కాబట్టి మేము దీనిపై పని చేస్తున్నాం. కానీ మ్యాచ్?లను 74 నుంచి 94కి పెంచే విషయాన్ని ప్రస్తుతానికి అంత సీరియస్?గా తీసుకుంటున్నామని చెప్పలేను. ఎందుకంటే ఇందులో అనేక ఇతర అంశాలు ముడిపడి ఉన్నాయి. ఐసీసీ నిర్వహించే వివిధ ఎఫ్?టీపీలు, ద్వైపాక్షిక సిరీస్?లు, మల్టీనేషనల్? టోర్నమెంట్?లను కూడా మేము పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల మ్యాచ్?లు పెంచడంపై ప్రస్తుతానికి ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోవడం లేదు. అయితే 2027 తర్వాత పరిస్థితులు ఎలా మారతాయో చూద్దాం. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుంది” అని దేవజిత్ సైకియా అన్నారు.

# భారత్, న్యూజిలాండ్ సిరీస్ షెడ్యూల్ ప్రకటన

- **కివీస్ గడ్డపై ఆరేళ్ల తర్వాత టీమ్ఇండియా టెస్టు సిరీస్**
- **రోహిత్, విరాట్?కు కీలకం కానున్న న్యూజిలాండ్ పర్యటన**
- **న్యూజిలాండ్‌తో 12 మ్యాచ్‌లు ఆడనున్న భారత్**
- **ఐదు వన్డేలు, ఐదు టీ20లతో పాటు రెండు టెస్టులు**
- **అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ జరగనున్న సిరీస్**

టీమిండియా కోసం న్యూజిలాండ్ ఓ భారీ సిరీస్‌ను ప్లాన్ చేసింది. భారత్ - న్యూజిలాండ్ దేశాల మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కివీస్ ఈ టూర్ ప్లాన్ చేసింది. న్యూజిలాండ్ గడ్డపై 40 రోజుల పాటు క్రికెట్ అభిమానులకు ఓ పెద్ద పండగే అని చెప్పొచ్చు. ఐదు వన్డేలు, ఐదు టీ20లతో పాటు రెండు టెస్టులతో కలిపి మొత్తం 12 మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత్ - న్యూజిలాండ్ మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా టీమిండియా కోసం కివీస్ ఓ మెగా టూర్ ప్లాన్ చేసింది. ఏకంగా 40 రోజుల పాటు క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించేలా టెస్టు, టీ 20, వన్డేలతో ఓ మెగా సిరీస్‌నే సిద్ధం చేసింది. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు న్యూజిలాండ్‌లో భారత జట్టు పర్యటించనుంది. ఈ టూర్‌లో ఐదు టీ20లు, రెండు టెస్టులతో పాటు ఐదు వన్డేల సిరీస్ కూడా ఉండటం విశేషం.న్యూజిలాండ్ ఇప్పటి వరకు ఆతిథ్యం ఇచ్చిన అతిపెద్ద ద్వైపాక్షిక సిరీస్‌లో టీమిండియా పర్యటన ఒకటిగా నిలవనుంది. అలాగే ఒకే పర్యటనలో ఓ విదేశీ జట్టుతో న్యూజిలాండ్ ఆడనున్న అత్యధిక మ్యాచ్‌ల సిరీస్ కూడా ఇదే కావడం విశేషం. భారత్ - న్యూజిలాండ్ మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సిరీస్ నిర్వహించనున్నారు.భారత్ - న్యూజిలాండ్ మధ్య ఈ సిరీస్ అక్టోబర్ 22 నుంచి ప్రారంభం కానుంది. క్రైస్ట్ చర్చ్ వేదికగా అక్టోబర్ 22న తొలి టీ20 మ్యాచ్‌తో ఈ సిరీస్ ప్రారంభమవుతుంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ అనంతరం నవంబర్ 4 నుంచి ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా వన్డే సిరీస్ స్టార్ట్ అవుతుంది. ఆ తర్వాత నవంబర్ 19 నుంచి రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనున్నారు. నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్‌లో తొలి టెస్టు, నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్‌లో రెండో టెస్టు నిర్వహిస్తారు. భారత్ చివరిసారిగా 2019 - 20 సీజన్‌లో టెస్టు సిరీస్ కోసం న్యూజిలాండ్‌కు వెళ్లింది. ఆ తర్వాత మళ్లీ న్యూజిలాండ్ రెండుసార్లు భారత్‌లో పర్యటించింది. ముఖ్యంగా 2024-25లో 3- 0తో క్లీన్ స్వీప్ చేసింది. రోహిత్, కోహ్లి టెస్టు రిటైర్మెంట్‌కు బీజం పడింది కూడా ఈ సిరీస్ నుంచే!

అయితే కివీస్ గడ్డపై ఆరేళ్ల తర్వాత టీమ్ఇండియా టెస్టు సిరీస్? ఆడనుంది. 2019లో న్యూజిలాండ్?లో భారత్ చివరిసారిగా టెస్టు మ్యాచ్ ఆడింది. ఇక 2022 తర్వాత ఆ దేశంలో భారత్ ఆడుతున్న తొలి వైట్ బాల్ సిరీస్ కూడా ఇదే కావడం విశేషం. 2022 నవంబర్?లో కివీస్?లో టీమ్ఇండియా వన్డే సిరీస్ ఆడింది. ఆ తర్వాత మళ్లీ ఈ పర్యటనతోనే కివీస్ గడ్డపై టీమ్ఇండియా ఆడనుంది. మరోవైపు స్టార్లు రోహిత్, విరాట్‌కు తమ కెరీర్‌లో ఇదే ఆఖరి న్యూజిలాండ్ పర్యటన అయ్యే అవకాశం ఉంది. టీ20, టెస్టులకు గుడ్‌బై చెప్పేసిన ఈ స్టార్లు వన్డే ఫార్మాట్‌లోనే ఆడుతున్నారు. వచ్చే ఏడాది వన్డే వరల్డ్?కప్‌లో ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ ఇద్దరికి తమతమ కెరీర్‌లో మరోసారి న్యూజిలాండ్?లో ఆడే అవకాశం రాకపోవచ్చు!మరో మూడు రోజుల్లో టీమ్ఇండియా ఇంటర్నేషనల్ క్రికెట్?లో మళ్లీ సందడి చేయనుంది. భారత్ పర్యటనకు అఫ్గానిస్థాన్ రానుంది. ఈ టూర్?లో ఏకైక టెస్టు మ్యాచ్, మూడు వన్డేలు ఆడనుంది. జూన్ 06న టెస్టు ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్?కు ముల్లాన్?పూర్ వేదిక కానుంది. ఆ తర్వాత జూన్ 13న ధర్మశాల వేదికగా తొలి వన్డే జరగనుంది. జూన్ 17న రెండో, 20న మూడో వన్డేలో అఫ్గాన్- భారత్ ఢీ కొట్టనున్నాయి.



**న్యూజిలాండ్‌లో భారత పర్యటన పూర్తి**

**షెడ్యూల్**

**టీ20 సిరీస్**

మొదటి టీ20 - అక్టోబర్ 22, క్రైస్ట్ చర్చ్. రెండో టీ20 - అక్టోబర్ 24, క్రైస్ట్‌చర్చ్. మూడో టీ20 - అక్టోబర్ 27, వెల్లింగ్టన్. నాలుగో టీ20 - అక్టోబర్ 30, ఆక్లాండ్. ఐదో టీ20 - నవంబర్ 1, హామిల్టన్.

**వన్డే సిరీస్:**

మొదటి వన్డే - నవంబర్ 4, ఆక్లాండ్. రెండో వన్డే - నవంబర్ 7, వెల్లింగ్టన్. మూడో వన్డే - నవంబర్ 10, హామిల్టన్. నాలుగో వన్డే - నవంబర్ 13, మౌంట్ మాంగనుయ్, ఐదో వన్డే - నవంబర్ 15, మౌంట్ మాంగనుయ్.

**టెస్టు సిరీస్:**

మొదటి టెస్టు - నవంబర్ 19-23, వెల్లింగ్టన్. రెండో టెస్టు - నవంబర్ 27 - డిసెంబర్ 1, క్రైస్ట్ చర్చ్.

# వైభవ్ సూర్యవంశీ రెమ్యునరేషన్ డబుల్



ఇండియా క్రికెట్ లో సరికొత్త సెన్సేషన్ గా మారిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ క్రేజ్ ఇప్పుడు అమాంతం పెరిగిపోయింది. ఐపీఎల్ 2026 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడి 237.30 ఊహించని స్ట్రైక్ రేట్ తో 776 రన్స్ బాదిన ఈ బిహార్ బ్యాటర్ మార్కెట్ ను షేక్ చేస్తున్నాడు. టోర్నమెంట్ లో ఆరెంజ్ క్యాప్ తో పాటు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డును కూడా సొంతం చేసుకున్నాడు. ఈ సంచలన పర్ఫార్మెన్స్ తర్వాత మైదానం వెలుపల కూడా అతడి డిమాండ్ డబుల్ అయింది. ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ తో రూ. 1.10 కోట్ల యాన్యువల్ కాంట్రాక్ట్ లో ఉన్న వైభవ్, బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల రూపంలో అంతకు మించి సంపాదిస్తున్నాడు. ఆటోమొబైల్, మీడియా వర్గాల సమాచారం ప్రకారం ఐపీఎల్ స్టార్ట్ అవ్వడానికి ముందు వైభవ్ ఒక్కో బ్రాండ్ డీల్ కోసం దాదాపు రూ. 1 కోటి వరకు ఛార్జ్ చేసేవాడు. అయితే సీజన్ ముగిసేసరికి అతడి ఎండార్స్‌మెంట్ ఫీజ్ ఏకంగా డబుల్ అయింది. ప్రస్తుతం అతడు ఒక్కో కొత్త డీల్ కోసం రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ ఎక్స్ పర్ట్ ఒకరు ఎన్డీటీవీ కి స్పష్టం చేశాడు. ఇప్పటికే కాంప్లాన్, రెడ్ బుల్ లాంటి పెద్ద బ్రాండ్లకు అంబాసిడర్ గా మారిన వైభవ్ తో కొలాబరేట్ అవ్వడానికి మరికొన్ని కంపెనీలు లైన్ లో ఉన్నాయి. చిన్న ఏజ్ లోనే వస్తున్న ఈ సడన్ పాపులారిటీ, బిజినెస్ డీల్స్ ను వైభవ్ సూర్యవంశీ పేరెంట్స్ జాగ్రత్తగా హ్యాండిల్ చేస్తున్నారు. అతడి ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ కూడా ఈ విషయంలో ఈ వండర్ కిడ్ మేనేజ్‌మెంట్ టీమ్ కు పూర్తి సపోర్ట్ అందిస్తోంది. ఐపీఎల్ లో సృష్టించిన రికార్డుల కారణంగానే బ్రాండ్లు అతడి వెనుక పరుగులు పెడుతున్నాయని ఎక్స్ పర్ట్స్ చెబుతున్నారు. ఒకవేళ భవిష్యత్తులో వైభవ్ ఐపీఎల్ మెగా వేలంలోకి వస్తే ఏకంగా రూ. 30 కోట్ల వరకు బిడ్ దక్కించుకునే ఛాన్స్ ఉందని కొందరు అంచనా వేస్తున్నారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే వైభవ్ సాధించిన అచీవ్‌మెంట్స్ చూసి మాజీ క్రికెటర్లు, లెజెండ్స్ అతడిని సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, సునీల్ గవాస్కర్ లాంటి గ్రేట్ ప్లేయర్లతో పోలుస్తున్నారు. టాలెంట్ పరంగా అతడి హిట్టింగ్ కెపాసిటీ అద్భుతంగా ఉన్నప్పటికీ, కెరీర్ ఇప్పుడిప్పుడే స్టార్ట్ అవుతుండటంతో వచ్చే అవకాశాలను జాగ్రత్తగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఐపీఎల్ తెచ్చిన ఈ స్టార్ డమ్ తో ఇండియా క్రికెట్ లో అతడి బ్రాండ్ వాల్యూ సరికొత్త రికార్డులను క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఒక్క తప్పిదమే పంజాబ్ కింగ్స్ పతనాన్ని శాసించింది

## రెడిట్‌లో వెల్లడించిన సచిన్ టెండూల్కర్

ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ప్రయాణం విచిత్రంగా ముగిసింది. టోర్నీ ఫస్టాఫ్‌లో 7 మ్యాచ్‌లకు 6 గెలిచిన పంజాబ్ కింగ్స్.. మరో మ్యాచ్ రద్దవ్వడంతో 13 పాయింట్స్‌తో అగ్రస్థానంలో నిలిచింది. ఐపీఎల్ చరిత్రలోనే తొలి 7 మ్యాచ్‌ల్లో ఓటమెరుగని జట్టుగా సరికొత్త రికార్డ్‌ను లిఖించింది. కానీ తర్వాతి 7 మ్యాచ్‌ల్లో వరుసగా 6 మ్యాచ్‌లు ఓడి ప్లే ఆఫ్స్ చేరకుండానే ఇంటిదారి పట్టింది. పంజాబ్ కింగ్స్ వైఫల్యానికి గల కారణాన్ని క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ రెడిట్‌లో వెల్లడించాడు. ఫస్టాఫ్ టోర్నీలో పంజాబ్ ప్రక్రియను నమ్ముకుంటే.. సెకండాఫ్‌లో ఫలితాలపై ఎక్కువ ఫోకస్ పెట్టి మూల్యం చెల్లించుకుందన్నాడు. ‘పంజాబ్ కింగ్స్ ఈ టోర్నీకి మంచి ఊపును తీసుకొచ్చింది. వారి క్రికెట్ సానుకూలంగా.. ధైర్యంగా.. ఆట స్వరూపాన్నే మార్చేసేలా సాగింది. సుదీర్ఘమైన టోర్నీల్లో మూమెంటమ్ అనేది చాలా కీలక పాత్ర పోషిస్తుంది. వేగంగా సాగే టోర్నీలో అంతా ప్రక్రియపైనే ఆధారపడి ఉంటుంది తప్ప ఫలితాలకు ఎక్కువగా కట్టుబడిపోకూడదు. పంజాబ్ జట్టు ఫస్టాఫ్‌లో ప్రక్రియపై ఎక్కువ దృష్టి పెట్టగా.. సెకండాఫ్‌లో ఫలితాలపై ఎక్కువ ఫోకస్ పెట్టింది.’అని సచిన్ పేర్కొన్నాడు. గుజరాత్ టైటాన్స్ చాలా నిలకడగా రాణించిందని సచిన్ కొనియాడాడు. ‘గుజరాత్ టైటాన్స్ విషయానికి వస్తే.. ఈ సీజన్ మొత్తం ఒకే తరహాలో ప్రదర్శన కనబర్చింది. ఐపీఎల్‌లో ఎప్పుడూ ఏం జరుగుతుందో చెప్పలేం. కానీ గుజరాత్ ఫలితాలు అటు ఇటుగా మారినా.. ఆ జట్టు తమ ఆటతీరును మాత్రం మార్చుకోలేదు. ఫలితాలతో సంబంధం లేకుండా చాలా నిలకడగా రాణించారు. సుదీర్ఘ టోర్నీలో అప్పుడప్పుడు మెరుపు ప్రదర్శనలు చేయడం లేదా ఏదో ఒక మ్యాచ్‌లో ఒంటరి పోరాటంతో గెలవడం కంటే.. ఇలాంటి అనిశ్చితిని నియంత్రించే సామర్థ్యమే చాలా విలువైనదిగా నిలుస్తుంది. ఈ సీజన్‌లోనూ పాయింట్స్ టేబుల్‌లో జట్లు మారాయి. ఫస్టాప్ సమయంలో ఉన్నపాయింట్స్ టేబుల్.. టోర్నీ ముగిసే సరికి వేరుగా కనిపించింది. టోర్నీ సాగుతున్న కొద్దీ జట్లు తమ ఆటను మెరుగుపర్చుకున్నాయి.’అని సచిన్ టెండూల్కర్ చెప్పుకొచ్చాడు.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999